




సమాజ హితం – మా అభిమతం

www.arunaprabha.com

# అరుణ ప్రభ

ARUNAPRABHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

RNI NO. TEL TEL/2023/89778








రంగారెడ్డి - హైదరాబాద్ సంపుటి : 04 సంచిక : 199 పేజీలు : 12, వెల రూ. 5/- గురువారం, సెప్టెంబరు 10, 2026

PUBLISHED FROM RANGAREDDY, HYDERABAD. CIRCULATED BY : RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD, CHITTOOR, VISAKHAPATNAM, SRIKAKULAM, ELURU, ONGOLE, VIJAYAWADA, SPSR NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL, KADAPA


## రాహుల్ గాంధీకి ఇటాలియన్ భాషలో లేఖ రాసిన తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు

- ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యపై వినూత్నంగా నిరసన
- రూ.15 వేల కోట్ల బకాయిలతో 40 లక్షల మంది విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఆరోపణ
- విద్యార్థులకు మద్దతిస్తే ప్రభుత్వం అరెస్టులు చేస్తోందని విమర్శ
- కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ హామీలను నెరవేర్చలేదని విమర్శలు



## కేసీఆర్‌కు చెడు జరగాలని ఆయన కుటుంబ సభ్యులే కోరుకుంటున్నారు: మహేశ్ గౌడ్

- కేసీఆర్‌కు హాని జరగాలని కాంగ్రెస్ ప్రభుత్వం కోరుకోలేదన్న మహేశ్ గౌడ్
- కేసీఆర్ గతంలో గాయపడినప్పుడు సీఎం రేవంత్ వెంటనే స్పందించారని వెల్లడి
- కేసీఆర్‌కు రాష్ట్రంలో అత్యధిక భద్రత ఉందని వివరణ
- సిరిసిల్లలో సీఎం రేవంత్‌కు పిండ ప్రదానంపై మహేశ్ గౌడ్ ప్రశ్నలు



## హైదరాబాద్ హాస్టళ్లకు 'హైడ్రా' స్ట్రిక్ట్ వార్నింగ్.. 3 నెలలే డెడ్‌లైన్!

- హైదరాబాద్‌లో నిబంధనలు పాటించని హాస్టళ్లపై హైడ్రా ఉక్కుపాదం
- ప్రమాదకర భవనాలను ఖాళీ చేసేందుకు 3 నెలల గడువు
- వచ్చే ఏడాది జనవరి 1 నుంచి ప్రత్యేక తనిఖీలు
- విద్యార్థుల భద్రతతో రాజీపడొద్దని కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం



# కాంగ్రెస్‌లో రేవంత్‌కు పెరుగుతున్న పట్టు?

## వరుస షోకాజ్ నోటీసులతో క్రమశిక్షణకు ప్రాధాన్యం..

## అసమ్మతి స్వరాలపై అధిష్టానం కఠిన వైఖరి?

హైదరాబాద్, సెప్టెంబర్ 9: తెలంగాణ కాంగ్రెస్‌లో ఇటీవలి పరిణామాలు పార్టీ అంతర్గత వ్యవహారాల్లో మార్పుకు సంకేతాలుగా కనిపిస్తున్నాయి. గతంలో నేతలు బహిరంగంగా పరస్పర విమర్శలు చేసుకోవడం, ప్రభుత్వ నిర్ణయాలపై అసంతృప్తిని వ్యక్తం చేయడం వంటి ఘటనలు తరచూ కనిపించేవి. అయితే తాజాగా పార్టీ క్రమశిక్షణా చర్యలు వేగం పుంజుకోవడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. టీపీసీసీ డిసిప్లినరీ యాక్షన్ కమిటీ వరుసగా షోకాజ్ నోటీసులు జారీ చేస్తుండటం ఈ మార్పుకు ప్రధాన ఉదాహరణగా నిలుస్తోంది. నాగర్‌కర్నూల్ ఎంపీ, కమిటీ చైర్మన్ మల్లు రవి నేతృత్వంలో పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనలకు సంబంధించి పలువురు నేతల నుంచి వివరణ కోరుతున్నారు.

**ఒకేరోజు తొమ్మిది మందికి నోటీసులు**

ఇటీవల ఒకేరోజు తొమ్మిది మంది నేతలకు షోకాజ్ నోటీసులు జారీ కావడం గాంధీభవన్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కాన్వాయ్‌పై దాడి ఘటనకు సంబంధించి ఐదుగురు స్థానిక నేతలకు, గజ్వేల్ ఘర్షణలకు సంబంధించి మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, జూపల్లి మల్లారెడ్డికి నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ఆదిలాబాద్ రాజకీయ వివాదానికి సంబంధించి కంది శ్రీనివాస్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డిల వివరణ కూడా కోరినట్లు

(మిగతా 2వ పేజీలో)





## గణేశ్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

### అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి.. సీపీ సజ్జనర్ ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 9: గణేశ్ ఉత్సవాలు, నిమజ్జన ఊరేగింపును ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనర్ ఆదేశించారు. ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో బుధవారం ఆయన అధ్యక్షతన వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో అడిషనల్ సీపీ (ఎల్అండ్ఓ) తఫ్సీర్ ఇక్బాల్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, జాయింట్ సీపీ (ట్రాఫిక్) జోయల్ డేవిస్, జాయింట్ సీపీ (స్పెషల్ బ్రాంచ్) ఎస్.ఎం. విజయ్‌కుమార్, జాయింట్ సీపీ (ఫ్యూచర్ సిటీ) చందనా దీప్తితో పాటు హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ల అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్లు, హైడ్రా, ఆర్టీసీ, ఫైర్ సర్వీసెస్, వైద్య, విద్యుత్, రవాణా, ఆర్అండ్‌బీ, వాటర్‌వర్క్స్,

(మిగతా 2వ పేజీలో)



## తెలంగాణ ఉద్యోగులకు శుభవార్త..

## పీఆర్‌సీపై ప్రభుత్వం కీలక అడుగు

### నివేదిక త్వరగా ఇవ్వాలని పీఆర్‌సీ చైర్మన్‌కు సీఎస్ లేఖ..

### బకాయి డీఏలు, ఫిట్‌మెంట్‌పై ఉద్యోగ సంఘాల ఒత్తిడి

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన వేతన సవరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్య చేపట్టింది. రెండో వేతన సవరణ కమిషన్ నివేదికను వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రభుత్వానికి అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పీఆర్‌సీ ఛైర్మన్ ఎన్. శివశంకర్‌ను కోరారు. ఈ మేరకు ఆయనకు లేఖ రాశారు. కమిషన్ గడువు ముగుస్తున్న నేపథ్యంలో నివేదిక సమర్పణ ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వం సూచించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**గడువు ముగుస్తున్న వేళ..**

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణ కోసం ప్రభుత్వం రెండో వేతన సవరణ కమిషన్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఉద్యోగుల వేతనాలు, భత్యాలు, ఇతర ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన అంశాలను పరిశీలించి ప్రభుత్వానికి సిఫారసులు చేయడం కమిషన్ ప్రధాన బాధ్యత. ప్రస్తుతం కమిషన్ గడువు ముగియనున్న నేపథ్యంలో నివేదిక సమర్పణపై ప్రభుత్వం దృష్టి సారించింది. కమిషన్ నివేదిక అందిన తర్వాత దానిని పరిశీలించి ఉద్యోగుల వేతన సవరణకు సంబంధించి ప్రభుత్వం తదుపరి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. దీంతో పీఆర్‌సీ ప్రక్రియ ఎప్పుడు పూర్తవుతుందన్న అంశంపై ఉద్యోగుల్లో ఆసక్తి నెలకొంది. మరోవైపు వేతన సవరణ అమలుపై ఉద్యోగ సంఘాల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం బకాయిలను విడుదల చేయాలని ఉద్యోగ సంఘాలు

(మిగతా 2వ పేజీలో)

# మైలేజ్ ఎవరికి.. డ్యామేజ్ ఎవరికి?

### అసెంబ్లీ తొలిరోజు నిరసనలు.. పోలీసులతో తోపులాట..

### తాతా మధు వ్యాఖ్యలతో రాజకీయ దుమారం




హైదరాబాద్, సెప్టెంబర్ 9: తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల తొలిరోజు అసెంబ్లీ వెలుపల చోటుచేసుకున్న పరిణామాలు అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మధ్య రాజకీయ వివాదానికి దారితీశాయి. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ బీఆర్ఎస్ చేపట్టిన ఆందోళన సందర్భంగా పోలీసులతో తోపులాట జరగడం, అనంతరం ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు ప్రచారంలోకి వచ్చిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో వివాదం మరింత విస్తరించింది. సమావేశాల ప్రారంభానికి ముందు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు నల్ల దుస్తులు ధరించి ప్లకార్డులతో నిరసన చేపట్టారు. అసెంబ్లీ వద్ద పోలీసులు వారిని అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో తమ పార్టీకి చెందిన మహిళా ఎమ్మెల్యేలు,

(మిగతా 2వ పేజీలో)



### ఇది బీఆర్ఎస్ సస్పెన్షన్ కాదు..

## ప్రజా సమస్యలపై వేసిన సస్పెన్షన్ వేటు: హరీశ్ రావు

హైదరాబాద్: తెలంగాణ శాసనసభ నుంచి బీఆర్ఎస్ సభ్యులను ఈ సెషన్ ముగిసేంత వరకు సస్పెండ్ చేయడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సస్పెన్షన్ కు గురైన తర్వాత మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై వేసిన వేటు కాదని, తెలంగాణ ప్రజల సమస్యలపై విధించిన సస్పెన్షన్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ హక్కుల కోసం, మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడి ఘటనలపై అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందుకే కక్షపూరితంగా సస్పెండ్ చేశారని మండిపడ్డారు. "ప్రజలేమో 'మా సమస్యలపై మాట్లాడండి' అని అడుగుతుంటే... రేవంత్ రెడ్డి మాత్రం 'సభ నుంచి బీఆర్ఎస్‌ను బయటకు తోసేయండి' అని మార్షల్స్‌ను ఆదేశిస్తున్నారు" అని హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# గవర్నర్‌ను కలిసిన కేటీఆర్..

## కాంగ్రెస్ సర్కార్‌పై ఫిర్యాదుల వెల్లువ

- గవర్నర్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీ
- 1000 రోజులు గడిచినా కాంగ్రెస్ హామీలు నెరవేర్చలేదని విమర్శ
- తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులు చేశారని ఫిర్యాదు
- దాడులకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు అందజేత
- రైతు బంధు, నిరుద్యోగ సమస్యలపై ప్రభుత్వ వైఫల్యంపై ఆరోపణ



# గణేశ్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

హెచ్‌ఎండీఏ, మెట్రో, ఎంఎంటీఎస్ తదితర శాఖల ప్రతినిధులు తమ ఏర్పాట్లను వివరించారు.

### విద్యుత్ వైర్లపై ప్రత్యేక దృష్టి

గత ఐదేళ్ల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని సీపీ సజ్జనర్ సూచించారు. నిమజ్జన ఊరేగింపు మార్గాల్లో రోడ్లకు అడ్డంగా ఉన్న విద్యుత్, కేబుల్, ఇంటర్నెట్ వైర్లను తొలగించి తగిన క్లియరెన్స్ ఉండేలా చూడాలని ఆదేశించారు. గతంలో చోటుచేసుకున్న ప్రమాదాలు పునరావృతం కాకుండా సంబంధిత శాఖలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గణేశ్ మండపాలకు నిబంధనల ప్రకారం సురక్షిత విద్యుత్ కనెక్షన్లు అందించాలని, ఎర్తింగ్ పూర్తి చేసి ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టరేట్ అనుమతులు పొందేలా చూడాలని తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపివేత లేదా వైర్ల తొలగింపు వంటి చర్యలకు ముందు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

### రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి

ప్రధాన నిమజ్జన మార్గాలు, ఫీడర్ రూట్లలో కొనసాగుతున్న రోడ్డు, నాలా, స్లాబ్ పనులను లిసెప్టెంబర్ 14, 15 నాటికిలి పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు కొత్తగా రోడ్ల తవ్వకాలు, కేబుల్ పనులు చేపట్టవద్దని సూచించారు. పాతబస్తీలో మెట్రో పనులకు సంబంధించి విద్యుత్ స్తంభాల మార్పిడి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

### 24 గంటల వైద్య సేవలు

ఉత్సవాల సందర్భంగా ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నిర్ణయించారు. హైదరాబాద్ జిల్లా పరిధిలో లి26 ప్రాంతాల్లోలి, బాలాపూర్ పరిధిలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు అంబులెన్సులు, పారామెడికల్ సిబ్బందిని 24 గంటలూ అందుబాటులో ఉంచాలని వైద్యశాఖ అధికారులకు సూచించారు. ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారులను కోరారు.

### ట్రాఫిక్.. పార్కింగ్ ఏర్పాట్లు

నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణకు తగిన పార్కింగ్ ప్రదేశాలను ముందుగానే సిద్ధం చేయాలని అధికారులు సూచించారు. ఆర్టీసీ, రవాణా శాఖలు అవసరమైన సంఖ్యలో బస్సులు, గూడ్స్ వాహనాలు, డ్రైవర్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. నిమజ్జనం రోజున వినియోగించే క్రేన్లు, ఆపరేటర్లు, సూపర్‌వైజర్లు, మెయింటెనెన్స్ బృందాల వివరాలను ముందుగానే పోలీసులకు అందించాలని సూచించారు.

### మెట్రో.. ఎంఎంటీఎస్ సేవల పొడిగింపు

సెప్టెంబర్ 25న జరిగే ప్రధాన గణేశ్ నిమజ్జనంలి సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రో రైలు సేవలను అర్ధరాత్రి లి1 గంట వరకులి కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా నాంపల్లి, లక్డీకాపూల్, ఖైరతాబాద్, సంజీవయ్య పార్క్, జేమ్స్ స్ట్రీట్, బేగంపేట్ స్టేషన్ల నుంచి రాత్రంతా ఎంఎంటీఎస్ రైళ్లను నడిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలకు నిమజ్జన ఏర్పాట్లు, మార్గాలు, ట్రాఫిక్ మార్పులు, బడా గణేశ్ దర్శన ముగింపు తదితర సమాచారాన్ని టీవీ స్క్రోలింగ్‌లు, పత్రికల ద్వారా విస్తృతంగా తెలియజేయాలని అధికారులకు సూచించారు.

# కాంగ్రెస్‌లో రేవంత్‌కు పెరుగుతున్న పట్టు?

తెలుస్తోంది. పార్టీ నేతలు బహిరంగ వివాదాలకు దూరంగా ఉండాలనే సంకేతాన్ని ఈ చర్యల ద్వారా నాయకత్వం ఇస్తోందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

### అధిష్టానం నుంచి స్వేచ్ఛ?

పార్టీలో క్రమశిక్షణ చర్యలు పెరగడం వెనుక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ నాయకత్వానికి కాంగ్రెస్ అధిష్టానం ఎక్కువ స్వేచ్ఛ ఇచ్చిందనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. ముఖ్యంగా మంత్రివర్గ విస్తరణపై అంచనాలు కొనసాగుతున్న సమయంలో కొందరు సీనియర్ నేతలు చేసిన వ్యాఖ్యలు కూడా ఈ నేపథ్యంలో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వంటి సీనియర్ నేతలు గతంలో చేసిన ఘాటు వ్యాఖ్యల అనంతరం ముఖ్యమంత్రి సమావేశాల్లో పాల్గొనడం కూడా పార్టీ అంతర్గత సమన్వయంపై చర్చకు దారితీసింది.

### క్రమశిక్షణకు ప్రాధాన్యం

పార్టీ నిర్ణయాలను బహిరంగంగా వ్యతిరేకించడం, నేతలపై విమర్శలు చేయడం వంటి అంశాలను ఇకపై కఠినంగా పరిగణించే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాల్లో అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే ఈ చర్యలు పూర్తిగా ముఖ్యమంత్రి నిర్ణయాల ఆధారంగానే జరుగుతున్నాయనే అభిప్రాయానికి బదులుగా.. పార్టీ అధిష్టానం మార్గదర్శకత్వంలో టీపీసీసీ క్రమశిక్షణా వ్యవస్థ పనిచేస్తోందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అధిష్టానం ప్రతినిధి మీనాక్షి నటరాజన్ మార్గదర్శకత్వంలో పార్టీ వ్యవహారాలను సమన్వయం చేస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ ఉంది. దీంతో సీనియర్, జూనియర్ అనే తేడా లేకుండా పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవనే సంకేతం వెళ్లినట్లు రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

### స్థానిక పోరుకు ముందు వ్యూహాత్మక అడుగులా?

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ శ్రేణులను సమన్వయం చేయడం, అంతర్గత విభేదాలను తగ్గించడం కాంగ్రెస్ నాయకత్వానికి కీలకంగా మారనుందని పరిశీలకులు భావిస్తున్నారు. అయితే కాంగ్రెస్‌లో చాలాకాలంగా ఉన్న అంతర్గత విభేదాలను కేవలం క్రమశిక్షణ చర్యలతో పూర్తిగా పరిష్కరించడం సాధ్యమా అన్నది కూడా ప్రశ్నగానే ఉంది. వరుస నోటీసులతో నేతలు బహిరంగ వ్యాఖ్యలకు దూరంగా ఉండే అవకాశం ఉన్నప్పటికీ.. దీర్ఘకాలికంగా పార్టీ ఐక్యతకు ఇది ఎంతవరకు దోహదపడుతుందనేది రాబోయే రోజుల్లో తేలనుంది. మొత్తంగా.. తెలంగాణ కాంగ్రెస్‌లో క్రమశిక్షణకు ప్రాధాన్యం పెరగడం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వానికి అధిష్టానం మద్దతు మరింత స్పష్టమవుతోందనే చర్చకు దారితీస్తోంది. అయితే ఈ క్రమశిక్షణా చర్యలు పార్టీని మరింత ఐక్యంగా మారుస్తాయా.. లేక అసమ్మతి స్వరాలు మరో రూపంలో బయటకు వస్తాయా అన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## రాహుల్ గాంధీకి ఇటాలియన్ భాషలో లేఖ రాసిన తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు

తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సమస్యపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దృష్టిని ఆకర్షించేందుకు బీజేపీ సీనియర్ నాయకులు ఎన్. రామచందర్ రావు వినూత్న నిరసన చేపట్టారు. బుధవారం ఆయన రాహుల్ గాంధీకి ఇటాలియన్ భాషలో లేఖ రాశారు. రాష్ట్రంలో సాగుతున్న ఆందోళనలు, విద్యార్థుల నిరసనలు, పోలీసుల లాఠీఛార్జులు, అరెస్టులు వంటివేవీ రాహుల్ గాంధీని గానీ, తెలంగాణ ప్రభుత్వాన్ని గానీ కదిలించలేకపోయాయని, అందుకే ఆయన "మాతృభాష" అయిన ఇటాలియన్‌లో లేఖ రాస్తున్నట్లు రామచందర్ రావు ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయని, దీనివల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన దాదాపు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, ఫలితంగా విద్యార్థులు ఉన్నత చదువులకు, ఉద్యోగ అవకాశాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిధుల కొరతతో విద్యాసంస్థల యాజమాన్యాలు, అధ్యాపకులు, సిబ్బంది కూడా అరకొర వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై విద్యార్థులకు మద్దతుగా నిలిస్తే రాష్ట్ర ప్రభుత్వం అరెస్టులు, పోలీసు చర్యలతో అణచివేస్తోందని రామచందర్ రావు విమర్శించారు. సమస్య పరిష్కారం కోసం గళమెత్తినందుకు గత 10 రోజుల్లోనే తనను నాలుగుసార్లు అరెస్టు చేశారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 'యూత్ డిక్లరేషన్'లో ఇచ్చిన నిరుద్యోగ భృతి, ఉద్యోగాల భర్తీ, విద్యా భరోసా కార్డుల వంటి హామీలను నెరవేర్చలేదని ఆయన దుయ్యబట్టారు. రాహుల్ గాంధీ తక్షణమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి బకాయిలన్నీ విడుదల చేయించాలని, విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేలా చర్యలు తీసుకోవాలని రామచందర్ రావు డిమాండ్ చేశారు.

## తెలంగాణ ఉద్యోగులకు శుభవార్త.. పీఆర్‌సీపై ప్రభుత్వం కీలక అడుగు

డిమాండ్ చేస్తున్నాయి. అలాగే పీఆర్‌సీ నివేదిక ఆధారంగా ఫిట్‌మెంట్‌ను ప్రకటించి వేతన సవరణను అమలు చేయాలని కోరుతున్నాయి. వేతన సవరణ ఆలస్యం కావడంతో ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పీఆర్‌సీ నివేదికపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది.

### నివేదిక తర్వాత కీలక నిర్ణయం

పీఆర్‌సీ కమిషన్ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన అనంతరం అందులోని సిఫారసులను ప్రభుత్వం పరిశీలించనుంది. ఉద్యోగుల వేతనాలు, ఫిట్‌మెంట్, ఇతర ప్రయోజనాలకు సంబంధించి తదుపరి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ప్రభుత్వం నుంచి తాజాగా వచ్చిన లేఖతో పీఆర్‌సీ ప్రక్రియలో కదలిక మొదలైందని ఉద్యోగ వర్గాలు భావిస్తున్నాయి. నివేదిక త్వరగా అందితే వేతన సవరణపై ప్రభుత్వం కూడా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుందని ఉద్యోగులు ఆశిస్తున్నారు.

### ఉద్యోగుల్లో ఆశలు

రెండో పీఆర్‌సీ గడువు ముగుస్తున్న సమయంలో ప్రభుత్వం నివేదికను త్వరగా సమర్పించాలని కోరడం ఉద్యోగుల్లో ఆశలు పెంచింది. ఇప్పటికే బకాయి డీఏలు, వేతన సవరణ, ఫిట్‌మెంట్ అంశాలపై ఎదురుచూస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం తీసుకున్న తాజా చర్య ప్రాధాన్యం సంతరించుకుంది. పీఆర్‌సీ నివేదిక ఎప్పుడు అందుతుంది? ప్రభుత్వం దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? ఫిట్‌మెంట్ ఎంత మేరకు ఉండనుంది? బకాయి డీఏల విడుదలపై ఎలాంటి చర్యలు ఉంటాయి? అనే అంశాలపై ఉద్యోగుల్లో ఆసక్తి నెలకొంది. కమిషన్ నివేదిక సమర్పణతో ఈ అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# ఆయుష్ విద్యార్థులకు తెలంగాణ సర్కారు శుభవార్త.. భారీగా పెరిగిన స్టైఫండ్

**ఆయుష్ విద్యార్థుల స్టైఫండ్‌ను భారీగా పెంచిన తెలంగాణ ప్రభుత్వం**

**అల్లోపతి వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్‌ల పెంపు**

**గత పదేళ్లలో ఒక్కసారీ పెంచలేదని విద్యార్థుల ఆవేదన**

**సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహకు కృతజ్ఞతలు**

**ఆయుష్ బలోపేతానికి అనేక చర్యలు తీసుకుంటున్నామన్న ప్రభుత్వం**



తెలంగాణలో ఆయుష్ వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. వారి స్టైఫండ్‌లను భారీగా పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఆయుర్వేద, హోమియోపతి, యునాని, నాచురోపతి విభాగాల్లోని హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థుల స్టైఫండ్‌లను అల్లోపతి వైద్య విద్యార్థులతో సమాన స్థాయికి పెంచుతూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో హౌస్ సర్జన్ల నెలవారీ స్టైఫండ్ రూ. 13,754 నుంచి రూ. 29,792కు పెరిగింది. అదేవిధంగా, పీజీ విద్యార్థుల స్టైఫండ్ రూ. 34,385 నుంచి ఏకంగా రూ. 74,482కు పెరిగింది. తమ చిరకాల డిమాండ్‌ను నెరవేర్చినందుకు కృతజ్ఞతలు తెలిపేందుకు ఆయుష్ విద్యార్థులు, వైద్యులు బుధవారం సచివాలయంలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గత పదేళ్లలో గత ప్రభుత్వం తమ స్టైఫండ్‌లను ఒక్కసారి కూడా పెంచలేదని, దీనివల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నామని ఈ సందర్భంగా విద్యార్థులు మంత్రి దృష్టికి తెచ్చారు. తమ సమస్యను అర్థం చేసుకుని, అల్లోపతి విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఆరోగ్య మంత్రికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో మంచి వైద్యులుగా రాణించి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఆయన ఆకాంక్షించారు. గత రెండున్నరేళ్లుగా రాష్ట్రంలో ఆయుష్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని వివరించారు. సుమారు 700 మంది యోగా ఇన్‌స్ట్రక్టర్లను నియమించామని, 138 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం చేపట్టామని తెలిపారు. సిద్దిపేట, జయశంకర్ భూపాలపల్లి, వికారాబాద్‌లలో 50 పడకల సమీకృత ఆయుష్ ఆసుపత్రులను ఏర్పాటు చేశామని, కరీంనగర్‌లో రూ. 15 కోట్లతో మరో ఆసుపత్రి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. సాంప్రదాయ వైద్య పరిజ్ఞానాన్ని ఆధునిక పద్ధతులతో అనుసంధానిస్తూ పరిశోధనల వైపు దృష్టి సారించాలని మంత్రి విద్యార్థులకు సూచించారు. ముఖ్యంగా పేద, గ్రామీణ ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పెట్టుకోవాలని పిలుపునిచ్చారు. దశలవారీగా రాష్ట్రంలోని అన్ని ఆయుష్ ఆసుపత్రులను, క్లినిక్‌లను అప్‌గ్రేడ్ చేస్తామని హామీ ఇచ్చారు.




## హైదరాబాద్ హాస్టళ్లకు 'హైడ్రా' స్ట్రిక్ట్ వార్నింగ్.. 3 నెలలే డెడ్‌లైన్!

హైదరాబాద్ నగరంలోని హాస్టళ్ల భద్రతపై హైడ్రా కఠిన నిబంధనలు జారీ చేసింది. సురక్షితం కాని, అనుమతులు లేని భవనాల్లో నడుస్తున్న హాస్టళ్లను మూడు నెలల్లోగా సురక్షితమైన భవనాల్లోకి మార్చాలని నిర్వాహకులకు అల్టిమేటం ఇచ్చింది. వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నుంచి తనిఖీలు చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్రమాదకర భవనాలను కూల్చివేస్తామని స్పష్టం చేసింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అధ్యక్షతన హాస్టళ్ల నిర్వాహకులు, భవన యజమానులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హాస్టళ్లలో నివసించే విద్యార్థులు, ఉద్యోగుల భద్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ప్రతి హాస్టల్‌లో అగ్నిమాపక భద్రత, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, నిర్మాణ పటిష్ఠత తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించి ప్రమాదకర భవనాల్లో హాస్టళ్లు నడిపేవారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటీవల గచ్చిబౌలిలోని అంజయ్య నగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనం కూలి ఇద్దరు మరణించడం, ఢిల్లీలో హాస్టల్ భవనం కూలి పలువురు చనిపోవడం వంటి ఘటనల నేపథ్యంలో హైడ్రా ఈ కీలక నిర్ణయాలు తీసుకుంది. అనుమతులు లేని భవనాలపై క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించేందుకు మూడు మున్సిపల్ కార్పొరేషన్లతో సమన్వయం చేసుకుంటామని రంగనాథ్ తెలిపారు. కేవలం లాభార్జన కోసం భద్రతను విస్మరించవద్దని, హాస్టల్ వాసులను తమ సొంత బిడ్డల్లా భావించి వసతులు కల్పించాలని ఆయన నిర్వాహకులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య అగ్నిప్రమాదాలు నివారణ చర్యల, ఫైర్ సేఫ్టీ నిబంధనలపై వీడియోల ద్వారా నిర్వాహకులకు సమగ్ర అవగాహన కల్పించారు.

## కేసీఆర్‌కు చెడు జరగాలని ఆయన కుటుంబ సభ్యులే కోరుకుంటున్నారు: మహేశ్ గౌడ్

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు హాని జరగాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ కోరుకోలేదని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేతగా ఆయనకు తగిన గౌరవం ఇస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ నేతలే సీఎం రేవంత్ రెడ్డి పట్ల అనుచితంగా ప్రవరిస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో బుధవారం మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. కేసీఆర్ గతంలో బాత్‌రూమ్‌లో జారిపడినప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించారని చెప్పారు. అర్ధరాత్రి గ్రీన్ ఛానల్ ద్వారా ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించారని తెలిపారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చినప్పుడు సీఎం స్వయంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారని చెప్పారు. సీఎం తర్వాత రాష్ట్రంలో అత్యధిక భద్రత పొందుతున్న వ్యక్తి కేసీఆర్ అని పేర్కొన్నారు. సిరిసిల్లలో సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ నేతలు పిండ ప్రదానం చేయడం ఎంతవరకు సమంజసమని మహేశ్ గౌడ్ ప్రశ్నించారు. స్పీకర్ పదవిపై బీఆర్ఎస్ నేత తాతా మధు చేసిన వ్యాఖ్యలపైనా ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతల దిగజారుడు రాజకీయాలను తెలంగాణ సమాజం ఖండిస్తోందన్నారు. కేసీఆర్ ప్రాణాలకు ప్రమాదం ఉందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్‌కు చెడు జరగాలని ఆయన సొంత కుటుంబ సభ్యులే కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు. హరీశ్‌రావు క్షుద్ర పూజలు చేస్తున్నారని కవిత మాట్లాడిన వీడియోలు ఉన్నాయని చెప్పారు. కేసీఆర్‌పై కాంగ్రెస్‌కు గౌరవం ఉందని మహేశ్ గౌడ్ అన్నారు. ఆయన త్వరగా కోలుకుని అసెంబ్లీకి రావాలని కోరుకుంటున్నామని చెప్పారు. దళితులు, బలహీన వర్గాలకు న్యాయం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# మైలేజ్ ఎవరికి.. డ్యామేజ్ ఎవరికి?

ఇతర ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.

### పోలీసుల వైఖరిపై బీఆర్ఎస్ ఆరోపణలు

తోపులాట సందర్భంగా కొందరు బీఆర్ఎస్ నేతలు గాయపడ్డారని, మహిళా ఎమ్మెల్యేలు కూడా తమకు ఎదురైన పరిస్థితులను వివరించారని ఆ పార్టీ నేతలు తెలిపారు. పోలీసుల చర్యను ప్రశ్నిస్తూ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. మరోవైపు, బీఆర్ఎస్ నేతలే పోలీసులతో తోపులాటకు దిగారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. విధుల్లో ఉన్న పోలీసులను అడ్డుకోవడం, తోపులాటకు దిగడం వంటి దృశ్యాలు ఘటనకు సంబంధించిన వీడియోల్లో కనిపిస్తున్నాయని వారు పేర్కొన్నారు.

### వీడియోలపై ఇరుపక్షాల వాదనలు

ఘటనకు సంబంధించిన వీడియోలు, ఫొటోలను కాంగ్రెస్ నేతలు ప్రస్తావిస్తూ.. పోలీసులు తమ విధుల్లో భాగంగానే వ్యవహరించారని వాదించారు. బీఆర్ఎస్ నేతలు మాత్రం పోలీసుల చర్యల కారణంగానే పరిస్థితి ఉద్రిక్తంగా మారిందని ఆరోపించారు. దీంతో ఘటనకు సంబంధించి ఇరుపక్షాలు తమ వాదనలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశాయి. వీడియో దృశ్యాల పూర్తి సందర్భం, ఘటనకు దారితీసిన పరిస్థితులపై మరింత స్పష్టత అవసరమనే అభిప్రాయాలు కూడా వ్యక్తమయ్యాయి.

### తాతా మధు వ్యాఖ్యలపై వివాదం

ఇదే సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు ప్రచారంలోకి వచ్చిన వ్యాఖ్యలు మరో వివాదానికి దారితీశాయి. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. స్పీకర్ పదవికి, శాసనసభ గౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలను సమర్థించలేమని అధికారపక్ష నేతలు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై తాతా మధు వివరణ ఇస్తూ.. తాను స్పీకర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేయలేదని, పోలీసుల వ్యవహారశైలిపై మాట్లాడినట్లు తెలిపారు. తన వ్యాఖ్యల వల్ల ఎవరైనా మనస్తాపానికి గురై ఉంటే వాటిని ఉపసంహరించుకుంటున్నట్లు వెల్లడించారు.

### రాజకీయంగా కొత్త చర్చ

ఒకవైపు పోలీసుల వైఖరిపై బీఆర్ఎస్ ఆరోపణలు చేస్తుండగా.. మరోవైపు పోలీసులతో జరిగిన ఘర్షణ, తాతా మధు వ్యాఖ్యలను కాంగ్రెస్ ప్రధాన అంశాలుగా తీసుకుంది. దీంతో అసెంబ్లీ సమావేశాల తొలి రోజు రాజకీయ చర్చ ప్రధానంగా ఈ ఘటనల చుట్టూనే సాగింది. ప్రజా సమస్యలను ప్రస్తావించేందుకు ప్రతిపక్షం చేపట్టిన నిరసనలకు ఎంత మేర రాజకీయ ప్రయోజనం లభించింది? అదే సమయంలో చోటుచేసుకున్న వివాదాలు ఆ పార్టీపై ఎలాంటి ప్రభావం చూపాయి? అన్న అంశాలపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అసెంబ్లీ సమావేశాలు ఇంకా కొనసాగనున్న నేపథ్యంలో ఈ ఘటనల ప్రభావం రాబోయే చర్చలపై ఎంతవరకు ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది. ప్రభుత్వం, ప్రతిపక్షం రెండూ తమ వాదనలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్న నేపథ్యంలో.. తదుపరి రోజుల్లో అసెంబ్లీ వేదికగా రాజకీయ చర్చలు మరింత వేడెక్కే అవకాశం ఉంది. తొలిరోజు జరిగిన పరిణామాల్లో ఇరుపక్షాలు తమ వాదనలను బలంగా వినిపించాయి. అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్న కొద్దీ ఈ వివాదం రాజకీయంగా ఏ స్థాయికి వెళుతుందనేది చూడాల్సి ఉంది.



# పల్లెలే పట్టుగొమ్మలు

దేశాన్ని పునర్నిర్మించుకోవాలంటే అట్టడుగుస్థాయి నుంచి బడుగు బలహీనవర్గాలు అభివృద్ధి చెందాలని మహాత్మా గాంధీజీ అన్నారు. గ్రామస్థాయి నుంచే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన భావించారు. ముఖ్యంగా గ్రామ పరిపాలనలో వికేంద్రీకరణ జరిగితేనే గ్రామాల ప్రగతి విరాజిల్లుతుందని గాంధీజీ బలంగా నమ్మారు. నాడు మహాత్మాగాంధీ అన్న మాటలు నేడు తెలంగాణలో ఆవిష్కృతమవుతున్నాయి. ఫలితంగా గాంధీ మార్గంలోనే తెలంగాణలో గ్రామీణ పరిపాలన కొనసాగుతున్నది. ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో కొనసాగుతున్న దార్శనిక పాలనకు పలురంగాల్లో కేంద్రం ఏటా ప్రకటిస్తున్న అవార్డులే గీటురాయిగా నిలుస్తున్నాయి. తెలంగాణ ఆవిర్భావ అనంతరం రాష్ట్రంలోని గ్రామాలు ఊహించనివిధంగా మార్పు చెందాయి. ముఖ్యంగా నెర్రెలు బారిన బీడు భూములు ఇప్పుడు పచ్చగా కళకళలాడుతున్నాయి. 1.34 కోట్ల ఎకరాల్లో రైతులు తమ భూములను సాగు చేస్తున్నారు. ఇది సీఎం కేసీఆర్ దార్శనిక పాలన వల్లే సాధ్యమైంది. కాగా, గత ఐదేండ్లలో తెలంగాణ రాష్ట్రం 'రైస్ బౌల్ ఆఫ్ ఇండియా'గా అవతరించింది. రాష్ట్రంలో వ్యవసాయరంగం పురోగతి చెందిన కారణంగా వ్యవసాయానుబంధ రంగాలకు సైతం ప్రాధాన్యం పెరిగింది. ఫలితంగా కులవృత్తులపై ఆధారపడేవారికి నేడు చేతినిండా పని దొరుకుతున్నది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'పల్లె ప్రగతి' కార్యక్రమం ద్వారా గ్రామాలు అభివృద్ధికి నోచుకున్నాయి. అందుకే కేంద్ర ప్రభుత్వం ప్రకటించే 'పల్లె ప్రగతి' అవార్డుల్లో తెలంగాణ రాష్ట్రం అగ్రభాగాన నిలుస్తున్నది. ప్రధానంగా ప్రతి గ్రామపంచాయతీకి 'ట్రాక్టర్', 'ట్రాలీ', 'ట్యాంకర్', 'వైకుంఠధామం', 'డంపింగ్‌యార్డ్', 'నర్సరీ', 'పల్లె ప్రకృతి వనం' వంటి సదుపాయాలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. గ్రామీణ ప్రజలకు విద్యుత్ నిరంతరాయంగా అందుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ సమగ్రాభివృద్ధికి ప్రతి నెల రూ.227.50 కోట్లు గ్రాంట్లుగా విడుదల చేస్తున్నది. వీటిలో గ్రామ పంచాయతీలకు రూ.210.44 కోట్లు, మండల పరిషత్‌లకు రూ.11.37 కోట్లు, జిల్లా పరిషత్‌లకు రూ.5.69 కోట్లు అందుతున్నాయి. ఈ నిధులతో అభివృద్ధి పనులు సాఫీగా సాగుతున్నాయి. దీనిఫలితంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ 'సన్సద్ ఆదర్శ్ గ్రామ్ యోజన' కింద పది ఉత్తమ గ్రామాలను ప్రకటించింది. అందులో తెలంగాణ నుంచే ఏడు గ్రామాలుండటం అభినందనీయం. అలాగే కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ప్రకటించిన వార్షిక అవార్డుల్లోనూ 19 గ్రామాలు జాతీయ అవార్డులను కైవసం చేసుకున్నాయి. గతంలో కరీంనగర్ జిల్లాలోని సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి గ్రామం 'సన్సద్ ఆదర్శ్ గ్రామ్ యోజన' కింద మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నది. సిరిసిల్ల ఉత్తమ జిల్లా పరిషత్ అవార్డును, చందాపూర్, వనపర్తి-బాల స్నేహపూర్వక గ్రామ పంచాయతీ అవార్డు (2020-21) గెలుచుకున్నది. ఉత్తమ జిల్లా పరిషత్ అవార్డు సిరిసిల్ల, ఉత్తమ మండలాలుగా పర్వతగిరి (వరంగల్), పెద్దపల్లి, తిరుమలగిరి (సూర్యాపేట), కొడిమ్యాల (జగిత్యాల) నిలిచాయి. అంటే 'పల్లె ప్రగతి'లో భాగంగా పరిశుభ్రత, మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టిసారించడం ద్వారానే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయి. దీని ఫలితంగా తెలంగాణ గ్రామ పంచాయతీలకు 'దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయతీ సశక్తికరణ్ పురస్కార్', 'చైల్డ్ ఫ్రెండ్లీ గ్రామ పంచాయతీ అవార్డు', 'గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక అవార్డు', 'నానాజీ దేశ్‌ముఖ్ రాష్ట్రీయ గౌరవ్ గ్రామసభ పురస్కారం' అనే నాలుగు విభాగాల కింద అవార్డులు రావడం తెలంగాణ సర్కారు పనితీరుకు నిదర్శనం. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి సైతం బడ్జెట్‌లో పెద్దపీట వేస్తున్నది. ప్రభుత్వం ప్రవేశపెట్టే మొత్తం బడ్జెట్‌లో 2022-23 ఆర్థిక సంవత్సరంలో గ్రామీణాభివృద్ధికి రూ.8,557 కోట్లను కేటాయించింది. ఇది గత ఏడాదిలో గ్రామీణ అభివృద్ధికి కేటాయించిన నిధుల కంటే 18 శాతం అధికం. అందులో ఏకంగా రూ.1,460 కోట్లు 'మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ' పనులకు కేటాయించడం గొప్ప విషయం. గ్రామాల అభివృద్ధిలో ప్రభుత్వంతో పాటు అధికారులు, ప్రజల సహకారం కూడా అవసరం. ఆ దిశగా రాష్ట్రంలోని గ్రామాలు అభివృద్ధి చెంది మరిన్ని అవార్డులు కైవసం చేసుకోవాలని ఆశిద్దాం.

సంపాదకీయం

# దేశాన్ని కాపాడుకుందాం



నరేంద్రమోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తరువాత దేశ ఆర్థిక, సామాజిక పరిస్థితులు దారుణంగా దిగజారుతున్నాయి. మన్ కీ బాత్, మేక్ ఇన్ ఇండియా, ఒకే దేశం ఒకే పన్ను, ఒకే విధానం నినాదాలతో ప్రజలకు కుచ్చుటోపీ పెడుతున్నారు. ఆయన మాటలకు, చేతలకు పొంతన లేదు. కానీ ఇవేమీ పట్టించుకోని బీజేపీ, దాని మాతృ సంస్థ ఆర్ఎస్ఎస్ దేశాన్ని హిందూ రాష్ట్రంగా మార్చడానికి వడివడిగా అడుగులు వేస్తున్నాయి. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి 8 ఏండ్లు గడుస్తున్నప్పటికీ కొత్తదనం లేకపోవడం, ప్రభుత్వ రంగ సంస్థలను పూర్తిగా ధ్వంసం చేస్తూ ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ పేరుతో కంపెనీలను తెగనమ్ముతున్నది. గ్యాస్, పెట్రోల్, డీజిల్ లాంటి ధరలు అడ్డగోలుగా పెంచి పేద ప్రజల కొనుగోలు శక్తిని హరిస్తున్నది. గుజరాత్ నుంచి ప్రారంభమైన మోదీ కాషాయీకరణ విధానం దేశమంతా విస్తరింపజేయడమే లక్ష్యంగా బీజేపీ సాగుతున్నది. అన్ని రాష్ట్రాల్లో అధికారం తమకే చెందాలనే దురుద్దేశంతో ప్రాంతీయపార్టీలు, జాతీయ పార్టీలు అని తేడా లేకుండా బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్నచోట ప్రభుత్వంలో చిచ్చుపెడుతున్నది. అక్రమంగా అధికారాన్ని హస్తగతం చేసుకుంటున్నది. ఇప్పుడు దక్షిణ భారతదేశంలో అధికార సాధనే లక్ష్యంగా చాలా సీరియస్‌గా పావులు కదుపుతున్నది. భారతదేశాన్ని కాస్తా హిందూ దేశంగా మార్చాలనే దురుద్దేశపూరిత ఆలోచన బీజేపీలో ఉన్నది. ప్రశ్నించే గొంతుకలను నొక్కివేస్తున్నది. వారికి వ్యతిరేకంగా మాట్లాడిన వారిపై ఈడీ, ఐటీ, సీబీఐ దాడులు చేపిస్తూ రాజకీయ ప్రభావాన్ని తగ్గిస్తున్నది. మతోన్మాద, నియంతృత్వ, ఫాసిస్టు, ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోదీ మరోసారి అధికారంలోకి వస్తే మరింత రెచ్చిపోయే ప్రమాదం పొంచివున్నది. బీజేపీ దూకుడును అడ్డుకోవడానికి ప్రతిపక్షపార్టీలు కూడా దూకుడుగానేవ్యవహరిస్తున్నాయి. ప్రాంతీయ పార్టీలు ఆయా రాష్ట్రాల్లో తమ ఉనికిని నిలబెట్టుకుంటున్నాయి. చాలా రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలే అధికారంలో ఉన్నాయి. అయితే ప్రాంతీయ పార్టీల అధికారాన్ని కూల్చే ప్రయత్నంలో బీజేపీ ఉన్నది. అధికారం కోసం అర్రులు చాచే రోజుల్లో సైతం ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా సీపీఐ పని చేస్తున్నది. అక్టోబర్ 16న 'సేవ్ నేషన్' పేరుతో నిర్వహించే జాతీయ సదస్సులో బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతున్న పార్టీలను ఒకతాటిపై తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నది. బీజేపీతో కలిసి బీహార్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నితీష్‌కుమార్, దానితో విభేదించి ఆర్జేడి, వామపక్షాలతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. బీజేపీకి వ్యతిరేకంగా జరుగుతున్న పరిణామాలకు బీహార్‌ను ఒక ఉదాహరణగా తీసుకొవచ్చు. మరోవైపు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ బీఆర్ఎస్ ద్వారా జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించేందుకు సిద్ధమవుతున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ఇంకా ఏడాదికి పైగానే సమయం ఉన్నప్పటికీ ఇప్పటినుంచే దేశ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. దేశ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో బీజేపీ వ్యతిరేక కూటమి, అలాగే బీజేపీ, కాంగ్రెస్‌యేతర కూటములపై రకరకాల చర్చలు సాగుతున్నవి. ఇలాంటి పరిస్థితుల్లో వామ పక్షాలు కీలక పాత్ర పోషించాల్సి ఉన్నది. దేశం సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రస్తుత నేపథ్యంలో సీపీఐ 24వ జాతీయ మహాసభలు విజయవాడలో అక్టోబర్ 14 నుంచి 18 వరకు జరుగనున్నాయి. నిరంకుశ, మతోన్మాద, ఫాసిస్టు బీజేపీని 2024లో గద్దె దింపేందుకు సీపీఐ తన వంతు కర్తవ్యాన్ని జాతీయ రాజకీయాలలో నిర్వహిస్తున్నది. అధికారం కోసం అర్రులు చాచే రోజుల్లో సైతం ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా, అధికారంలో భాగస్వామి కాకుండా దేశానికి ప్రత్యామ్నాయ ప్రభుత్వాలను అందించిన చరిత్ర వామపక్షాలది. 2004లో దేశానికి అప్పుడప్పుడే ప్రమాదకారిగా మారుతున్న మితవాద ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని ఓడించి, యూపీఏ 1 ప్రభుత్వ ఏర్పాటులో వామపక్షాలు కీలక భూమిక పోషించాయి. రానున్న ఎన్నికల్లోనూ కీలక పాత్ర పోషించేందుకు సమాయత్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో జరుగుతున్న సీపీఐ జాతీయ మహాసభ ద్వారా బీజేపీకి ప్రత్యామ్నాయంగా జాతీయ స్థాయిలో విశాల లౌకిక, ప్రజాతంత్ర , వామపక్ష వేదిక ఏర్పాటుకు రూపకల్పన జరగనున్నది. అక్టోబర్ 16న 'సేవ్ నేషన్' పేరుతో నిర్వహించే జాతీయ సదస్సుకు బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతున్న పార్టీలను ఒకతాటిపై తీసుకువచ్చే ప్రయత్నాలలో భాగంగా బీహార్, కేరళ, తెలంగాణ , తమిళనాడు తదితర రాష్ట్రాల సీఎంలను ఆహ్వానిస్తున్నాము. ప్రతిపక్ష పార్టీల ఐక్యత కోసం జరిగే ప్రయత్నాలకు ఈ మహాసభ ఒక వేదిక కానున్నది.

-గుర్రం పాపిరెడ్డి
ఎడిటర్



# సంస్కరణలు అవసరం

దేశంలో అవినీతి, అక్రమాలను అరికట్టడం కేంద్ర దర్యాప్తు సంస్థల బాధ్యత. శాంతి భద్రతలను నెలకొల్పడం పోలీస్ వ్యవస్థ, రక్షణ సంస్థల బాధ్యత. వాటిని ప్రారంభించిన ఉద్దేశం కూడా అదే. కానీ ఇటీవల ఈ సంస్థలను కేంద్ర ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటోందని విమర్శలు వస్తున్నాయి. ఇది వాస్తవమేనని వార్తా కథనాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో దర్యాప్తు, పోలీస్ సంస్థల పనితీరులో సంస్కరణలు తప్పనిసరిగా మారాయి. ప్రతి దేశంలో ప్రజలు శాంతియుతంగా జీవించడానికి, ఆర్థిక పరమైన, సామాజిక పరమైన నేరాలను అరికట్టడానికి పోలీస్, దర్యాప్తు సంస్థలు అత్యావశ్యకం. కానీ మన దేశంలో నేటికీ బ్రిటిష్ వారి సామ్రాజ్య వాద విధానాలు, పోకడలు, విధి విధానాలు పోలీస్, దర్యాప్తు సంస్థల్లో కొనసాగుతుండటం వల్ల ప్రజలకు సరైన న్యాయం జరగడం లేదు. ఆయా సంస్థల్లో రాజకీయ నాయకులు, పాలకుల ప్రమేయం ఉండటం వల్ల అవి స్వతంత్రంగా పని చేయలేకపోవడం మరో ప్రధాన లోపం. స్నేహపూరిత పోలీసింగ్ విధానంతో ఇటీవల పోలీస్ వ్యవస్థ ప్రజలకు చేరువ అవుతున్నా, నేటికీ న్యాయం జరగడంలో ఆలస్యం అవుతున్నది. దర్యాప్తు, పోలీస్ సంస్థల్లో సిబ్బంది కొరత ముఖ్యంగా ఫోరెన్సిక్ సిబ్బంది తక్కువగా ఉండటం, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా ఉండటం, దోషులను పట్టుకొని శిక్ష విధించడంలో జాప్యం తదితర కారణాల వల్ల బాధితులకు సత్వర న్యాయం జరగడం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రాల పోలీసు వ్యవస్థలతోపాటు సీబీఐ, ఐబీ, ఈడీ, ఎన్ఐఏ లాంటి కేంద్ర దర్యాప్తు సంస్థల్లో సంస్కరణలు వేగవంతం చేయాలి. ఆ దిశగా నూతన చట్టాలు చేయాలి. ఆయా సంస్థలకు మౌలిక సదుపాయాలు కల్పించి తగినంత సిబ్బందిని నియమించాలి. ఆ సంస్థలకు రాజ్యాంగ పరిపుష్టి కల్పించాలి. 2024 నాటికి అన్ని రాష్ట్రాల్లో జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ)లను ఏర్పాటు చేస్తామని, దేశంలోని అన్ని జిల్లాల్లో ఫోరెన్సిక్ ల్యాబ్స్ ఏర్పాటు చేసి పరిశోధన వేగవంతం చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇటీవల ప్రకటించారు. ఇది అమలైతే నేరగాళ్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తడం ఖాయం. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాజకీయాల వల్ల, జోక్యం వల్ల ఈ సంస్థల ప్రతిష్ట మసకబారుతున్నది. నిజమైన దోషులకు సరైన శిక్ష పడటం లేదు. ప్రత్యర్థులను వేధించడానికి అధికారంలో ఉన్న ప్రభుత్వాలు, పార్టీలు ఈ సంస్థలను వాడుకుంటున్నాయి. అందుకే ఈ సంస్థల్లో సంస్కరణలు అనివార్యమయ్యాయి. సత్యమేవ జయతే అనే సూక్తి నిజం అవ్వాలంటే ఈ సంస్కరణలు తప్పనిసరి. దేశ ప్రజలందరికీ సరైన న్యాయం జరగాలంటే, వ్యాపారులు స్వేచ్ఛగా వ్యాపారం చేసుకోవాలంటే, రాజకీయ నాయకులు నిర్భయంగా ప్రజా సేవ చేయాలంటే ఈ సంస్కరణలు వెంటనే అమలు కావాలి. 1963లో కేంద్ర ప్రభుత్వ తీర్మానం ద్వారా సీబీఐ ఏర్పాటైంది. మొదట్లో బాగా పని చేసిన ఆ సంస్థ ఆ తర్వాత సిబ్బంది కొరత, కేసుల భారం, రాజకీయ జోక్యం వల్ల ప్రాభవం కోల్పోయింది. నేటికీ ఆ సంస్థకు రాజ్యాంగ పరమైన పూర్తి రక్షణ, విధి విధానాలు, మౌలిక సదుపాయాలు లేవు. ఎల్.పి.సింగ్ కమిటీ, అనేక పార్లమెంటు కమిటీలు ఈ సంస్థను బలోపేతం చేయడానికి పలు సూచనలు చేశాయి. కానీ వాటినీ ఏ ప్రభుత్వమూ అమలు చేయలేదు. మరో కేంద్ర దర్యాప్తు సంస్థ ఇంటిలిజెన్స్ బ్యూరో(ఐబీ)ని బ్రిటిష్ కాలంలో ఏర్పాటు చేశారు. దీనికీ రాజ్యాంగ పరమైన పూర్తి రక్షణ విధివిధానాలు, మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉండగా నేటికీ కల్పించలేదు. ఆధునిక అవసరాలకు, భారత దేశ స్థితిగతులకు అనుగుణంగా దీన్ని తీర్చిదిద్దలేదు. దర్యాప్తు సంస్థలు నిజాయితీగా, పారదర్శకంగా, ధైర్యంగా పని చేయడానికి అమెరికాలో కాంగ్రెస్నల్ కమిటీలు సూచనలు ఇస్తుంటాయి. బ్రిటన్‌లో దర్యాప్తు సంస్థలు స్వతంత్రంగా పని చేయడం కోసం రాజ్యాంగ రక్షణ కల్పించారు. ఇలాంటి సంస్కరణలు మన దేశంలోనూ అమలు చేయాలి. ప్రస్తుతం మన దేశంలో 530 ఫోరెన్సిక్ ల్యాబ్స్ ఉన్నాయి. వీటిలో 32 ప్రధానమైనవి, 80 ప్రాంతీయమైనవి, మిగిలిన 418 మొబైల్ యూనిట్లు. 140 కోట్ల జనాభా కలిగిన మన దేశ అవసరాలకు ఈ ల్యాబ్స్ సరిపోవు. 2020లో ఏర్పాటు చేసిన నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీకి తోడుగా మరో మూడు యూనివర్సిటీలు ఏర్పాటు చేయాలి. ఫోరెన్సిక్ సిబ్బందికి ఈ యూనివర్సిటీల్లో శిక్షణ ఇవ్వాలి.

# మూసీ ప్రక్షాళనకు కౌంట్‌డౌన్.. దసరా రోజు తొలి దశ పనులకు శ్రీకారం!

**దసరాకు మూసీ తొలి దశ పనులకు శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు**

**మొదటి విడత కోసం రూ.7,345 కోట్లతో ఇప్పటికే పరిపాలన అనుమతులు**

**ఏడీబీ నుంచి రూ.4,500 కోట్ల రుణ సమీకరణ.. మంజూరు ప్రక్రియ చివరి దశలో**

**ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు అభివృద్ధి పనులు**

**నదిలో బోటింగ్, ఇరువైపులా రోడ్లు, సైకిల్ ట్రాక్‌ల నిర్మాణం చేపట్టనున్న ప్రభుత్వం**

హైదరాబాద్ వాసులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు పనులకు ముహూర్తం దాదాపు ఖరారైంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ ప్రాజెక్టు తొలి దశ (ఫేజ్-1) పనులను దసరా పండుగ రోజున ప్రారంభించేందుకు ప్రభుత్వ యంత్రాంగం వేగంగా ఏర్పాట్లు చేస్తోంది. హైదరాబాద్ నగరానికి కొత్త అందాలు తీసుకువచ్చే ఈ ప్రాజెక్టుకు సంబంధించి అన్ని ప్రక్రియలను అధికారులు వేగవంతం చేశారు. తొలి దశ పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.7,345.12 కోట్లతో పరిపాలన అనుమతులు జారీ చేసింది. ఈ భారీ ప్రాజెక్టుకు అవసరమైన నిధులలో రూ.4,500 కోట్లను ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) నుంచి రుణంగా తీసుకోనున్నారు. మిగిలిన రూ.2,845.12 కోట్లను హెచ్ఎండీఏ, టీజీఐఐసీ సంస్థల ద్వారా సమకూర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే అధికారులు ఫేజ్-1 సమగ్ర ప్రాజెక్టు నివేదికను (డీపీఆర్) ఏడీబీకి సమర్పించగా, రుణ మంజూరు ప్రక్రియ చివరి దశలో ఉన్నట్లు సమాచారం. దీంతో దసరా నాటికి శంకుస్థాపన చేసేందుకు రంగం సిద్ధమవుతోంది.

**రెండు మార్గాల్లో అభివృద్ధి పనులు**

మూసీ నది వాస్తవానికి అనంతగిరి కొండల్లో మూసా, ఈసీ అనే రెండు పాయలుగా పుడుతుంది. ఈసీ నదిపై హిమాయత్‌సాగర్, మూసా నదిపై ఉస్మాన్‌సాగర్ (గండిపేట) జలాశయాలు ఉన్నాయి. ఈ రెండు జలాశయాల నుంచి దిగువకు ప్రవహించి, లంగర్‌హౌజ్ సమీపంలోని బాపూఘాట్ వద్ద కలిసిపోయి మూసీ నదిగా ప్రవహిస్తుంది. ఫేజ్-1లో భాగంగా, హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 9.2 కిలోమీటర్లు, ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 11.8 కిలోమీటర్ల మేర అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ రెండు పనులను ఒకేసారి పూర్తిచేసేలా ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా నదిలో పేరుకుపోయిన పూడిక, వ్యర్థాలను తొలగించడం, నీటిని నిల్వ చేసి బోటింగ్ వంటి సదుపాయాలు కల్పించడం, నదికి ఇరువైపులా సుందరమైన రోడ్లు, ల్యాండ్‌స్కేపింగ్, సైకిల్ ట్రాక్‌లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించనున్నారు. ముఖ్యంగా, నగరంలోని మురుగు నీరు నదిలో కలవకుండా ఇరువైపులా భారీ ట్రంక్ లైన్లు, వర్షపు నీటి డ్రెయిన్లను ఏర్పాటు చేయనున్నారు. ఫేజ్-1 పనులు ప్రారంభమైన తర్వాత, హైదరాబాద్ గేట్‌వే నిర్మాణ పనులపై దృష్టి సారిస్తామని అధికారులు చెబుతున్నారు. మరోవైపు, నాగోలు నుంచి గౌరెల్లి వరకు చేపట్టనున్న రెండో దశ (ఫేజ్-2) పనుల డీపీఆర్ తయారీ ప్రక్రియను కూడా వేగవంతం చేశారు.



# తాత మధు వ్యాఖ్యలపై కాంగ్రెస్ నిరసన

## స్పీకర్‌ను అవమానించేలా మాట్లాడిన ఎమ్మెల్సీపై కఠిన చర్యలు తీసుకోవాలి: కాంగ్రెస్ నాయకులు.






పెద్ద అంబర్‌పేట్:అరుణ ప్రభ సెప్టెంబర్ 09 : శాసనసభ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు పేర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద అంబర్‌పేట్--కుంట్లూర్ చౌరస్తాలో చావు డప్పు కొట్టి నిరసన కార్యక్రమం నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర దళిత విభాగం పిలుపుతో మాజీ కౌన్సిలర్ గ్యారాల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాటసింగారం సొసైటీ బ్యాంక్ చైర్మన్ కొత్తపల్లి జైపాల్ రెడ్డి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బి-బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కర్ చారి మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం కల్పించిన అత్యున్నతమైన శాసనసభ పీఠంపై ఉన్న స్పీకర్‌ను కించపరిచేలా మాట్లాడటం సభా మర్యాదకు విరుద్ధమని అన్నారు. దళిత నాయకత్వం ఎదుగుతుంటే ఓర్వలేకనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని వారు ఆరోపించారు. రాజకీయాలకు అతీతంగా రాజ్యాంగ వ్యవస్థలు, శాసనసభ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. స్పీకర్‌ను, ఆయన కుటుంబ సభ్యులను అవమానించేలా వ్యాఖ్యలు చేసినట్లయితే వాటిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సభా మర్యాదకు విరుద్ధంగా వ్యవహరించిన ఎమ్మెల్సీపై కఠిన చర్యలు తీసుకోవాలని, సంబంధిత నాయకులు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. అలాగే బీఆర్ఎస్ అధినేత, ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ కూడా ఈ వ్యవహారంపై స్పందించి క్షమాపణ చెప్పాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ద అంబర్‌పేట్ డివిజన్ అధ్యక్షులు పండుగల రాజు, కుంట్లూర్ డివిజన్ అధ్యక్షులు భీమగోని భాస్కర్ గౌడ్, పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధంకి కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు రాజ్‌కుమార్, పాలడుగు నాగార్జున, సీనియర్ నాయకులు ఎరుకల భాస్కర్ గౌడ్, సుప్రసీనా రెడ్డి, చేగూరు వెంకటేష్, రాజేంద్రప్రసాద్ గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సాయి గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సింగ్, శ్రీనివాసరెడ్డి, సుర్వి ప్రవీణ్ గౌడ్, గిరీష్, మహంత, గుడ్ల రవి, శివ తదితరులు పాల్గొన్నారు.

# వి.ఆర్. విద్యార్థి వంటి కవులు, రచయితలు కాళోజీ వారసత్వాన్ని పుణికిపుచ్చుకోవాలి: మంత్రి జూపల్లి

## రవీంద్రభారతిలో ఘనంగా కాళోజీ జయంతి ఉత్సవాలు

## ఆర్. విద్యార్థికి కాళోజీ సాహిత్య పురస్కార ప్రదానం






కాళోజీ నారాయణరావు ప్రజల గొంతుకగా, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కాళోజీ జయంతి సందర్భంగా బుధవారం రవీంద్రభారతిలో నిర్వహించిన ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైనిక కవిగా, ఖండాంతర కవిగా ప్రసిద్ధి చెందిన వి.ఆర్. విద్యార్థికి (వేలూరి రాములు) 2026 కాళోజీ నారాయణరావు సాహిత్య పురస్కారం ప్రదానం చేశారు. వి.ఆర్. విద్యార్థిని మంత్రి జూపల్లి కృష్ణారావు హృదయపూర్వకంగా అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. కాళోజీ నారాయణరావు సాహిత్య వారసత్వాన్ని వి.ఆర్. విద్యార్థి వంటి వారు పుణికిపుచ్చుకుని ముందుకు తీసుకెళ్లాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణ ప్రజల జీవితం, బాధ, ఆశ, ఆకాంక్ష, పోరాటం, ఆత్మగౌరవం కాళోజీ రచనల్లో స్పష్టంగా ప్రతిబింబించాయని పేర్కొన్నారు. కాళోజీ రచించిన 'నా గొడవ' కేవలం ఆయన వ్యక్తిగత గొడవ కాదని మంత్రి అన్నారు. సమాజంలోని అణగారిన, బాధిత, సామాన్య ప్రజల గొడవను తన గొడవగా కాళోజీ స్వీకరించారని చెప్పారు. ప్రజల సమస్యలను తన కలంతో వినిపించిన ప్రజాకవిగా కాళోజీ చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు.

### తెలంగాణ యాస.. కాళోజీ శ్వాస

తెలంగాణ భాష, యాసపై కాళోజీకి ఉన్న ప్రగాఢ విశ్వాసం ఆయన రచనల్లో స్పష్టంగా కనిపిస్తుందని మంత్రి అన్నారు. తెలంగాణ రచయితల వేదిక ప్రథమ మహాసభలో తెలంగాణ బతుకు, భాషపై కాళోజీ చేసిన అధ్యక్షోపన్యాసం తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్రలో సువర్ణ అధ్యాయమని పేర్కొన్నారు. ప్రజలు మాట్లాడే భాషలోనే రచనలు చేయాలని కాళోజీ బలంగా విశ్వసించారని చెప్పారు. 'అవతలి వారికి అర్థమవుతుందా?' అని ముందే ఆలోచించడం ద్వారా మనల్ని మనమే తక్కువ చేసుకోవద్దని, ఈ బానిస భావన పోవాలని కాళోజీ చెప్పిన మాటలు తెలంగాణ భాషపై ఆయనకున్న ఆత్మవిశ్వాసానికి నిదర్శనమన్నారు.

### పలుకుబడుల భాషకు పెద్దపీట

కాళోజీ దృష్టిలో భాషకు రెండు తీర్లు ఉన్నాయని మంత్రి తెలిపారు. ఒకటి బడిపలుకుల భాష, మరొకటి పలుకుబడుల భాష అని వివరించారు. పుస్తకాల్లో, పండితుల రచనల్లో కనిపించే భాష కంటే ప్రజల నాలుకలపై సహజంగా నడయాడే పలుకుబడుల భాషలోనే నిజమైన జీవన వాస్తవికత ఉంటుందని కాళోజీ విశ్వసించారని చెప్పారు. తన పోరాటాలన్నింటికీ కాళోజీ కవిత్వాన్ని మాధ్యమంగా ఎంచుకున్నారని, చెప్పదలుచుకున్న విషయాన్ని సూటిగా, సరళంగా ప్రజల భాషలోనే చెప్పేవారని మంత్రి పేర్కొన్నారు. అందుకే ఆయన రచనలు సామాన్య ప్రజలకు మరింత చేరువయ్యాయని అన్నారు. తెలంగాణ యాసను, భాషను, ప్రజల పలుకుబడిని కాళోజీ సాహిత్యంలో గౌరవప్రదంగా నిలబెట్టారని జూపల్లి అన్నారు. ప్రజలు మాట్లాడే భాషే ప్రజల హృదయ భాష అని తన రచనల ద్వారా నిరూపించారని పేర్కొన్నారు. తెలంగాణ మాండలికాన్ని తక్కువగా చూసే ధోరణులకు తన కలంతో సమాధానం చెప్పి, తెలంగాణ యాస పట్ల తనకున్న ప్రగాఢ విశ్వాసాన్ని చాటుకున్నారని వెల్లడించారు. భాష కేవలం సంభాషణకు ఉపయోగించే సాధనం మాత్రమే కాదని, ఒక జాతి చరిత్ర, సంస్కృతి, జీవన విధానం, ఆత్మగౌరవానికి ప్రతిబింబమని మంత్రి పేర్కొన్నారు. కాళోజీ అందించిన స్ఫూర్తిని కొనసాగించాలనే ఉద్దేశంతోనే ఆయన జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, నిథమ్ డైరెక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



# ధరల భారంతో సామాన్యుడిపై పెరుగుతున్న భారం

ధర్మవరం, సెప్టెంబర్ 09; (అరుణ ప్రభ న్యూస్): నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో పేదలు, కార్మికులు, రైతులు, ఉద్యోగులు, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం పెరుగుతోందని సీపీఐ నాయకులు అన్నారు. ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపిస్తూ ధర్మవరంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన చేపట్టారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు, చేతివృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జింక చలపతి మాట్లాడుతూ.. 2014తో పోలిస్తే బియ్యం, కందిపప్పు, వంటనూనె, చక్కెర, ఉల్లి, టమాటా ధరలు గణనీయంగా పెరిగాయని తెలిపారు. రైతుకు గిట్టుబాటు ధర లేకపోగా.. వినియోగదారుడికి మాత్రం అధిక ధరలు ఎందుకు? అని ప్రశ్నించారు. బ్లాక్‌మార్కెట్, అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత, దళారీ వ్యవస్థను అరికట్టాలని డిమాండ్ చేశారు. రైతు నుంచి వినియోగదారుడి వరకు దళారీ వ్యవస్థను నియంత్రించి, రైతుకు గిట్టుబాటు ధరతో పాటు ప్రజలకు సరసమైన ధరలకు నిత్యావసర వస్తువులు అందించాలని కోరారు. రైతుబజార్లను బలోపేతం చేయాలని, పెట్రోల్, డీజిల్‌పై పన్నుల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, రైతు, వ్యవసాయ కార్మిక, చేనేత, యువజన, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.




# నేత్రదానంలో ధర్మవరం రాష్ట్రంలోనే ముందంజ

ధర్మవరం, సెప్టెంబర్ 09; (అరుణ ప్రభ న్యూస్): నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా ఆరు మంది నేత్రదానం చేయడంతో ధర్మవరం రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని రిటైర్డ్ జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సంకరపు నరసింహులు తెలిపారు. ధర్మవరంలోని సేవా సంస్థల నిరంతర కృషితోనే అధిక సంఖ్యలో నేత్రదానాలు సాధ్యమయ్యాయని ఆయన అన్నారు. నేత్రదానానికి సహకరించిన కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. నేత్రదానంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సేవా సంస్థల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ముగింపు సందర్భంగా బైక్ ర్యాలీతో పాటు ఆరోగ్య సిబ్బంది, అధికారులతో అవగాహన ర్యాలీలు నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లు డాక్టర్ నరసింహులు పేర్కొన్నారు.



# రోడ్డుకు అడ్డంగా ఉన్న ఆక్రమణల తొలగింపు

## విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ధర్మవరం II టౌన్ పోలీసుల ప్రత్యేక తనిఖీలు

ధర్మవరం, సెప్టెంబర్ 09; (అరుణ ప్రభ న్యూస్) : ధర్మవరం పట్టణంలో విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ధర్మవరం II టౌన్ పోలీసులు కొత్తపేట రైల్వే స్టేషన్ మెయిన్‌రోడ్డులో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారికి ఇరువైపులా, రోడ్డు మార్జిన్లలో వాహనాలు, పాదచారుల రాకపోకలకు ఇబ్బంది కలిగించే విధంగా ఏర్పాటు చేసిన తోపుడు బండ్లు, ఇతర ఆక్రమణలు, అడ్డంకులను గుర్తించి తొలగించారు. రహదారిపై ఎలాంటి ఆటంకాలు లేకుండా వాహనాలు, పాదచారుల రాకపోకలు సాఫీగా సాగేలా పోలీసులు చర్యలు చేపట్టారు. రోడ్డును ఆక్రమించి వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారితో పాటు, రహదారికి అడ్డంగా వస్తువులు ఏర్పాటు చేసి రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్న వారికి కూడా సూచనలు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం జరిమానాలు విధించడంతో పాటు, భవిష్యత్తులో రహదారులు, రోడ్డు మార్జిన్లను ఆక్రమించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని పోలీసులు హెచ్చరించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగించే విధంగా ఎలాంటి అడ్డంకులు ఏర్పాటు చేయరాదని, ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. పట్టణంలో రహదారులపై ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి తనిఖీలు, చర్యలు కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

# హెచ్ఎండీఏ నియోపోలిస్, గోల్డెన్ మైల్ ఈ-వేలాల్లో ఆకర్షణీయమైన స్పందన ::: రికార్డు స్థాయి ఆసక్తి

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ సెప్టెంబర్ 9, 2026న గండిపేట్ మండలం, రంగారెడ్డి జిల్లాలోని కోకాపేట్ గ్రామ పరిధిలో ఉన్న నియోపోలిస్ లేఅవుట్, గోల్డెన్ మైల్ సైట్-1లోని విలువైన ప్లాట్లకు ఈ-వేలాలను నిర్వహించింది. ఈ వేలాలకు బిడ్డర్ల నుంచి విశేష స్పందన లభించింది. గోల్డెన్ మైల్ సైట్-1లోని 0.70 ఎకరాల ప్లాట్‌కు అత్యంత భారీ స్పందన లభించింది. ఎకరాకు రూ.70 కోట్లుగా నిర్ణయించిన ప్రతిపాదిత అప్‌సెట్ ధరకు గాను, అత్యధిక బిడ్ ధర ఎకరాకు రూ.115 కోట్లుగా నమోదైంది. హైదరాబాద్ పశ్చిమ ప్రాంతంలోని వ్యూహాత్మకంగా కీలకమైన ప్రాంతాల్లో ఉన్న ప్లాట్లకు కొనసాగుతున్న డిమాండ్‌కు ఇది నిదర్శనంగా నిలిచింది. నియోపోలిస్ లేఅవుట్‌లోని ప్లాట్ నంబర్ 17, 4.59 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, దీనికి ఒకే ఒక్క బిడ్ దాఖలైంది. ఈ బిడ్ ధర ఎకరాకు రూ.120 కోట్లుగా నమోదైంది. ఈ రెండు ప్లాట్లు కోకాపేట్‌లో వ్యూహాత్మకంగా కీలకమైన ప్రాంతాల్లో ఉన్నాయి. ఔటర్ రింగ్ రోడ్డు, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, గచ్చిబౌలి, హైటెక్ సిటీ వంటి ప్రధాన ప్రాంతాలకు అద్భుతమైన రవాణా అనుసంధానం కలిగి ఉన్నాయి. హైదరాబాద్ పశ్చిమ ప్రాంతంలోని అభివృద్ధి చెందిన వృద్ధి కారిడార్‌లో వీటి స్థానం కారణంగా రియల్ ఎస్టేట్ అభివృద్ధి, పెట్టుబడులకు వీటి ఆకర్షణ మరింత పెరుగుతోంది.

# భార్య హత్య కేసులో మరో అరెస్ట్..

## ప్రధాన నిందితుడికి సహకరించిన కంచర్ల సతీష్.. రిమాండ్‌కు తరలింపు



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ : ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 09: పదిర గ్రామంలో చోటుచేసుకున్న భార్య హత్య, అత్తపై హత్యాయత్నం కేసులో మరో వ్యక్తిని ఎల్లారెడ్డిపేట పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు పల్లపు సురేష్‌కు హత్యలో సహకరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కంచర్ల సతీష్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డిపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఓ.వెంకటేష్ తెలిపారు. ఈ నెల 2న పదిర గ్రామంలో ముస్తాబాద్ మండలం చీకోడుకు చెందిన పల్లపు సురేష్ తన భార్యను కత్తితో పొడిచి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన తన అత్తపై కూడా హత్యాయత్నానికి పాల్పడినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ప్రధాన నిందితుడు పల్లపు సురేష్‌ను ఇప్పటికే అరెస్ట్ చేసి జైలుకు పంపించారు. కేసు దర్యాప్తులో భాగంగా హత్యకు సురేష్‌కు సహకరించినట్లు గుర్తించిన పదిర గ్రామానికి చెందిన కంచర్ల సతీష్ (33), తండ్రి శంకరయ్యను బుధవారం అరెస్ట్ చేసినట్లు సీఐ ఓ.వెంకటేష్ వెల్లడించారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించడంతో జైలుకు తరలించినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, హత్య ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను దర్యాప్తులో వెల్లడిస్తామని సీఐ పేర్కొన్నారు.ం

# వినాయక చవితి వేడుకల్లో శబ్ద కాలుష్యానికి అడ్డుకట్ట వేయాలి

## డీజే నిర్వాహకులకు ముందస్తు అవగాహన కల్పించి.. నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ధర్మవరం ప్రజల విజ్ఞప్తి

ధర్మవరం, సెప్టెంబర్ 9; (అరుణ ప్రభ న్యూస్): వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ధర్మవరం పట్టణంలో విగ్రహ ప్రతిష్ఠాపన, ప్రత్యేక పూజలు, నిమజ్జన ఊరేగింపులు భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్న నేపథ్యంలో, వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. వినాయక చవితి వేడుకలు ప్రజలందరికీ ఎంతో ఆనందాన్ని కలిగించే పండుగ అని, భక్తుల ఉత్సాహానికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా కార్యక్రమాలు నిర్వహించుకోవాలని ప్రజలు పేర్కొంటున్నారు. అదే సమయంలో డీజేలు, భారీ శబ్ద పరికరాల వినియోగం పరిమితికి మించకుండా చూడాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు. ముఖ్యంగా నిమజ్జన ఊరేగింపుల సమయంలో డీజేల శబ్దం అధికంగా ఉండటం వల్ల చిన్నారులు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు, విద్యార్థులు, పరీక్షలకు సిద్ధమవుతున్న యువతతో పాటు సాధారణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ప్రజలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసు అధికారులు ముందుగానే డీజే నిర్వాహకులు, ఉత్సవ కమిటీలు, నిర్వాహకులతో సమావేశం నిర్వహించి శబ్ద పరిమితులు, అనుమతులు, సమయ పరిమితులు తదితర నిబంధనలపై స్పష్టమైన అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. అనుమతి అవసరమైన చోట పోలీసుల అనుమతి లేకుండా డీజేలు వినియోగించకుండా, నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి శబ్దం చేసే పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నిబంధనలు పాటించే నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, నిబంధనలు ఉల్లంఘించే వారిపై మాత్రమే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.భక్తుల విశ్వాసాలు, పండుగ సంప్రదాయాలకు పూర్తి గౌరవం ఇస్తూనే.. ప్రజల ప్రశాంతత, ఆరోగ్యం, భద్రతకు ఇబ్బంది కలగకుండా వినాయక చవితి వేడుకలు సజావుగా జరిగేలా పోలీసులు, ఉత్సవ నిర్వాహకులు, ప్రజలు పరస్పరం సహకరించాలని ధర్మవరం ప్రజలు కోరుతున్నారు.



# బీఎస్పీలో చేరిన రాంప్రసాద్

ధర్మవరం, సెప్టెంబర్ 9; (అరుణ ప్రభ న్యూస్) : ధర్మవరం నియోజకవర్గం బత్తలపల్లి మండలానికి చెందిన మాల్యావంతం రాంప్రసాద్ బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)లో చేరారు. విజయవాడలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బందేల గౌతమ్ కుమార్ ఆధ్వర్యంలో ఆయన పార్టీలో చేరగా, గౌతమ్ కుమార్ బీఎస్పీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ మాట్లాడుతూ గత పదేళ్లుగా ప్రజా సమస్యలపై ఉద్యమాల్లో పాల్గొంటున్నానని తెలిపారు. బహుజన రాజ్యాధికారం, సామాజిక న్యాయం, సమానత్వం లక్ష్యంగా బీఎస్పీలో చేరినట్లు చెప్పారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తూ బహుజన వర్గాల సమస్యలపై పోరాడతానన్నారు. తనను పార్టీలోకి ఆహ్వానించిన రాష్ట్ర అధ్యక్షుడు బందేల గౌతమ్ కుమార్, శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు సాకే వినయ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# బీసీల సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా పనిచేయాలి

ధర్మవరం, సెప్టెంబర్ 9; (అరుణ ప్రభ న్యూస్) : గొట్లూరులో నిర్వహించిన బీజేపీ ఓబీసీ మోర్చా శ్రీ సత్యసాయి జిల్లా కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ పాల్గొని ప్రసంగించారు. బీసీలు బలహీన వర్గాలు కాదని, ఆత్మగౌరవం విషయంలో ఎక్కడా తలవంచరని మంత్రి అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం పేదలు, బీసీలు, మధ్యతరగతి వర్గాల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. సెప్టెంబర్ 17 నుంచి నిర్వహించే సేవా కార్యక్రమాలను గ్రామస్థాయిలో చేపట్టాలని, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ధర్మవరం నియోజకవర్గ అభివృద్ధికి జలజీవన్ మిషన్, రహదారులు, విద్యుత్, వైద్య సదుపాయాలు తదితర రంగాల్లో పలు కార్యక్రమాలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. కదిరి--ముదిగుబ్బ మధ్య సుమారు రూ.650 కోట్లతో హైవే అభివృద్ధి పనులు, ఆయుర్వేద మెడికల్ కాలేజీ, మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ వంటి కార్యక్రమాలు తీసుకొస్తున్నట్లు చెప్పారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే తన లక్ష్యమని సత్యకుమార్ తెలిపారు. ప్రజల ఆశీర్వాదాలతో ధర్మవరం నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర, జిల్లా నాయకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# నిషేధిత ప్లాస్టిక్‌పై మున్సిపల్ అధికారుల ఉక్కుపాదం



ధర్మవరం, సెప్టెంబర్ 9; (అరుణ ప్రభ న్యూస్) : నిషేధిత సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వినియోగం, నిల్వ, విక్రయాలను అరికట్టేందుకు ధర్మవరం మున్సిపల్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కమిషనర్ వెంకటరమణయ్య ఆదేశాల మేరకు అసిస్టెంట్ కమిషనర్ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు మార్కెట్‌స్ట్రీట్, ఎన్టీఆర్ సర్కిల్, పి.ఆర్.టి. స్ట్రీట్, జేజేఆర్ నగర్ తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టాయి. తనిఖీల్లో సుమారు 300 కిలోల నిషేధిత ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులకు మొత్తం రూ.50 వేల జరిమానా విధించారు. నిషేధిత ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి, పారిశుద్ధ్యానికి నష్టం కలుగుతుందని అధికారులు తెలిపారు. వ్యాపారులు పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వినియోగించాలని సూచించారు. నిషేధిత ప్లాస్టిక్‌పై పట్టణవ్యాప్తంగా తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

# బలిజల సమస్యలు పరిష్కరించాలని మంత్రి సత్యకుమార్‌కు వినతి

ధర్మవరం, సెప్టెంబర్ 9; (అరుణ ప్రభ న్యూస్) : బలిజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాపునాడు శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు ఇటికింటి మహేష్ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. శ్రీకృష్ణదేవరాయల జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, పోతుకుంట రోడ్డులో కాపు భవన్ కోసం గతంలో కేటాయించిన 69 సెంట్ల స్థలాన్ని పరిరక్షించి భవన్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బలిజలకు జనాభా ప్రాతిపదికన తగిన ప్రాతినిధ్యం కల్పించాలని, ప్రతి జిల్లాలో కాపు భవన్‌కు రెండు ఎకరాల స్థలం, రూ.2 కోట్ల నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ బలిజలు ప్రస్తావించిన న్యాయమైన సమస్యలను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అవసరమైతే సంఘం నాయకులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వద్దకు తీసుకెళ్లి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి సత్యకుమార్‌ను కాపునాడు నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పలువురు కాపునాడు బలిజ సంఘం నాయకులు పాల్గొన్నారు.





## గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

## దిండి ఎస్ ఐ బాలకృష్ణ

అరుణ ప్రభ, దిండి ,సెప్టెంబర్ 9 ,త్వరలో నిర్వహించుకోబోయే గణేష్ ఉత్సవాలను మండల వ్యాప్తంగా శాంతియుతంగా జరుపుకోవాలని దిండి ఎస్ఐ బాలకృష్ణ అన్నారు.గణేష్ మండల ఆర్గనైజర్లు తప్పనిసరిగా ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అదేవిధంగా డీజే సౌండ్స్ పెట్టవద్దని ,ప్రజల కు ఎటువంటి అసౌకర్యం కలుగజేయరాదని, శాంతియుత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించుకోవాలని, మండల ఆర్గనైజర్సు కమిటీ సభ్యులు తగిన చర్యలు చేపట్టి శాంతియుతంగా నిమజ్జన కార్యక్రమాలు పూర్తి చేసుకోవాలని అన్నారు.డిండి మండల కేంద్రంతో సహా మండల వ్యాప్తంగా పలువురు ఆర్గనైజర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## తిరుమల నడక మార్గంలో మళ్లీ చిరుత.. భక్తుల భయాందోళన



తిరుమల శ్రీవారి దర్శనానికి పాదయాత్రగా వెళ్లే భక్తులను వన్యమృగాల భయం మరోసారి వెంటాడింది. అలిపిరి నడకమార్గంలో చిరుత పులి సంచారం కలకలం రేపింది. మెట్ల మార్గంలో 7వ మైలు దాటిన తర్వాత మండపం సమీపంలో చిరుత కనిపించడంతో భక్తులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కొందరు భయంతో కేకలు వేస్తూ వెనక్కి పరుగులు తీశారు. రెండు రోజుల క్రితం మధ్యాహ్నం 3 గంటల సమయంలో నరసింహస్వామి ఆలయానికి సమీపంలో చిరుత సంచరించినట్లు కొందరు భక్తులు తెలిపారు. తాజాగా 7వ మైలు వద్ద మరోసారి కనిపించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వరుస ఘటనలతో నడకమార్గంలో వెళ్లేందుకు భక్తులు జంకుతున్నారు. ముఖ్యంగా పిల్లలతో, వృద్ధులతో కలిసి ప్రయాణించే వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ సమాచారం అందిన వెంటనే తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) విజిలెన్స్ అధికారులు, అటవీ శాఖ సిబ్బంది అప్రమత్తమయ్యారు. భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని నడకమార్గంలో కీలక చర్యలు చేపట్టారు. ప్రస్తుతం భక్తులను ఒంటరిగా అనుమతించకుండా, గుంపులుగా మాత్రమే పంపిస్తున్నారు. చిరుత సంచరించినట్లు చెప్పిన ప్రాంతాల్లో భద్రతా సిబ్బంది గస్తీని ముమ్మరం చేశారు. భక్తులు అప్రమత్తంగా ఉండాలని, ధైర్యంగా గుంపులుగా ప్రయాణించాలని అధికారులు సూచిస్తున్నారు. కాగా, తిరుమల నడకమార్గంలో చిరుతల సంచారం కొత్తేమీ కాదు. గతంలోనూ పలుమార్లు చిరుతలు, ఎలుగుబంట్లు కనిపించడంతో భక్తులు భయాందోళనకు గురైన సంఘటనలు ఉన్నాయి. అప్పట్లో కూడా టీటీడీ



## ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించిన ఎంఈఓ కృష్ణహరి

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 09: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మండల వనరుల అభివృద్ధి కేంద్రంలో ఉత్తమ ఉపాధ్యాయులను అభినందిస్తూ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంఈఓ గాలిపల్లి కృష్ణహరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 24 మంది ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన సందర్భంగా వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ కృష్ణహరి ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి, మెమొంటోలు అందజేశారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీడీఓ సత్తయ్యతో పాటు ఎంఈఓ కృష్ణహరి మాట్లాడుతూ “నేటి బాలలే రేపటి పౌరులు. దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లో ఉంటుంది. విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల బోధన, మార్గదర్శకత్వంపై ఆధారపడి ఉంటుంది” అని అన్నారు. గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ ఉత్తమ ప్రతిభ కనబరిచి అవార్డులకు ఎంపికైన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో మరింత ఉత్సాహంగా పనిచేసి విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఉత్తమ ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు





## ఏడు ఆలయ చోరీ కేసులు ఛేదింపు.. ముగ్గురు అరెస్ట్

ధర్మవరం, సెప్టెంబర్ 09; (అరుణ ప్రభ న్యూస్): ధర్మవరం సబ్ డివిజన్ పరిధిలో వరుస ఆలయ చోరీలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు రూ.20.35 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ధర్మవరం రూరల్, బత్తలపల్లి, కనగానపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలోని ఏడు ఆలయ చోరీ కేసులు ఈ దర్యాప్తుతో ఛేదించినట్లు చెప్పారు. ధర్మవరం రూరల్ సీఐ ఎన్. ప్రభాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపట్టాయి. సెప్టెంబర్ 9న ధర్మవరం మండలం కునుతూరు శివారులోని కామిరెడ్డిపల్లి క్రాస్‌రోడ్ వద్ద నిందితులు సిల్లా నాగరాజు, చింతకాయల నవీన్‌కుమార్, సిల్లా శివను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. వారి నుంచి 6 కిలోల 750 గ్రాముల వెండి వస్తువులు, సుమారు 40 కిలోల ఇత్తడి వస్తువులు, డోలు, యాంప్లిఫయర్లు తదితర చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. చోరీలకు ఉపయోగించినట్లు భావిస్తున్న కట్టర్, పల్సర్ మోటార్‌సైకిల్, టీవీఎస్ జూపిటర్, టీవీఎస్ ఎక్స్‌ఎల్--100 వాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో రాత్రివేళ ఆలయాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు. ఆలయ నిర్వాహకులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు. కేసును ఛేదించిన డీఎస్పీ బీవీ జగన్నాథరాజు, సీఐ ఎన్. ప్రభాకర్, ఎస్ఐ జె. రాజశేఖర్, ప్రత్యేక బృందాలను ఎస్పీ అభినందించారు.



## యోగా సాధనతో ఆరోగ్యకర సమాజం

ధర్మవరం, సెప్టెంబర్ 09; (అరుణ ప్రభ న్యూస్): పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్ టెర్రస్‌పై ధర్మవరం యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సింధూర్ నిత్య ధ్యాన యోగ సాధన మందిరాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ యోగా గురూజీ భీష్మయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. యోగా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందని అన్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలని సూచించారు. ధర్మవరంలో ఇప్పటికే సుమారు 13 యోగా కేంద్రాలు పనిచేస్తున్నాయని తెలిపారు. యోగా గురూజీ భీష్మయ్య మూడు దశాబ్దాలుగా యోగా సాధనతో పాటు పలువురికి శిక్షణ అందించడం అభినందనీయమన్నారు. మందిరం ఏర్పాటుకు కృషి చేసిన గాజుల సోమేశ్వర్ రెడ్డి, మిత్రబృందాన్ని అభినందించారు. ధర్మవరం ప్రాంతానికి ఆయుర్వేద మెడికల్ కాలేజీ మంజూరైందని, టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని మంత్రి తెలిపారు. ప్రజలు ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకుంటే వైద్య ఖర్చులు, ప్రభుత్వంపై వైద్య భారం తగ్గుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రామ భూపాల్ రెడ్డి, యోగా అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల సోమేశ్వర్ రెడ్డి, జిల్లా క్రీడల అధికారి కిషోర్, యోగా గురువులు, సాధకులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.౦



## హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై విద్యార్థినులకు అవగాహన

ధర్మవరం, సెప్టెంబర్ 09; (అరుణ ప్రభ న్యూస్): అమ్మాయిల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ధర్మవరంలో విద్యార్థినులకు హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు నిజాం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. హెచ్‌పీవీ వైరస్ వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, వ్యాక్సిన్ ప్రాముఖ్యత, ప్రయోజనాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు. అమ్మాయిల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్లు రామంజి, ప్రభ, సభ్యులు యుగంధర్, ఉదయ్, పోలీస్ టీమ్, శక్తి టీమ్, శశి పాల్గొన్నారు.

# నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకుందాం

## వేడుకల్లో డి జె లకు అనుమతి లేదు
## గణేష్ మండపాల నిర్వాహకులతో
## డి ఎస్ పి,మున్సిపల్ చైర్పర్సన్ వెల్లడి







అరుణప్రభ 9 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : క్రమశిక్షణ భద్రత భక్తి శ్రద్ధలతో గణపతి నవరాత్రులను విజయవంతంగా నిర్వహిద్దాం మంచి పేరు తెచ్చుకుందాం అంటూ మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ మహబూబాబాద్ మున్సిపల్ శాఖ సంయుక్తంగా ప్రజలను కోరుతున్నారు మరికొన్ని రోజుల్లో జరగనున్న గణపతి నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా పోలీస్ శాఖ వారు నిర్వహించిన కార్యక్రమంలో మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ జ్యోతి రమేష్ నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా రెండు శాఖల వారు సంయుక్తంగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ముందస్తు జాగ్రత్తల గురించి మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్లో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్సవాల్లో అల్లర్లకు పాల్పడకుండా అన్ని కమిటీలు సంయుక్తంగా నిర్ణయాలు తీసుకొని ప్రశాంతంగా నవరాత్రులను జరుపుకోవాలని వారు కోరారు భక్తులందరూ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని పోలీస్ శాఖ ఈ సందర్భంగా సూచించింది గణేష్ మండపాల వద్ద భద్రతా చర్యలు పాటిస్తూ విద్యుత్ తీగలు అగ్నిప్రమాదాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సలహానిచ్చారు మండపాల వద్ద అధిక శబ్దంతో డీజే లు లౌడ్ స్పీకర్లు ఉపయోగించకుండా నిబంధనలు పాటించాలని వాహనదారులకు అంతరాయం కలగకుండా చూడాలని కోరారు నిమజ్జన సమయంలో నిర్వాహకులు భక్తులు పోలీసులకు సహకరించి శాంతిభద్రతలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు పోలీస్ శాఖ వారు నిరంతరం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ప్రత్యేక సిబ్బంది పర్యవేక్షణలో నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని పోలీస్ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ అధికారులు డిఎస్పి తిరుపతి రావు సిఐ అంజలి ఎస్ఐ లు మహబూబాద్ పట్టణ పలు వార్డుల కౌన్సిలర్లు రాజు లక్ష్మీనారాయణ జ్ఞానేశ్వర్ పద్మ ప్రవీణ్ నిమ్మల శీను గణపతి ఉత్సవాల నిర్వాహకులు పాత్రికేయ మిత్రులు పాల్గొన్నారు

# జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

## రాజీ మార్గం రాజమార్గం.. చిన్న కేసులతో సమయం, డబ్బు వృథా చేసుకోవద్దు: జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ ప్రతినిధి రాజన్న సిరిసిల్ల జిల్లా, సెప్టెంబర్ 09: ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. రాజీ పడదగిన కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన నిర్వాహణ కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం కేసులు, చెక్ బౌన్స్ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్, పెట్టీ కేసులు తదితర రాజీ పడదగిన కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు "రాజీ మార్గం రాజమార్గం" అని పేర్కొన్న ఎస్పీ.. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకొని విలువైన సమయాన్ని, డబ్బును వృథా చేసుకోవద్దని సూచించారు. న్యాయశాఖ కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాజీ పడదగిన కేసులను పోలీసులు గుర్తించి, సంబంధిత ఇరువర్గాల కక్షిదారులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుళ్లు, ఇతర పోలీసు సిబ్బంది కూడా కక్షిదారులకు లోక్ అదాలత్ ప్రయోజనాలపై అవగాహన కల్పించి, పరస్పర అంగీకారంతో కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం, సమయం మరియు ఖర్చు ఆదా అవుతుందని ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.



## సన్న వడ్ల బోనస్ కోసం ఈనెల 10వ తేదీ చివరిది.

అరుణ ప్రభ, దిండి, సెప్టెంబర్ 9 ,ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఉష్ణోగ్రతము అధికంగా ఉన్నందున రైతు లు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటితో, తక్కువ కాలంలో చేతికి వచ్చే స్వల్పకాలిక పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని దిండి మండల వ్యవసాయ అధికారి రెహనా ఒక ప్రకటనలో తెలిపారు .తేమ ఒత్తిడితో వాడి పోతున్న పంటలకు 2% యూరియా ద్రావణం లేదా నీటిలో కరిగే 19: 19: 19 :లేదా 13 :0 :45: ఎరువులను పంట అవసరాన్ని బట్టి సిఫార్సు చేసిన మోతాదులో పిచికారి చేసుకోవాలని రైతులకు తెలిపారు.అలాగే ప్రభుత్వం ప్రకటించిన సన్నవడ్ల బోనస్ పొందేందుకు అర్హులైన రైతులు తమ సన్న వడ్ల పంట వివరాలను ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని ఆమె అన్నారు .ఆన్లైన్ నమోదు ప్రక్రియకు ఈనెల 10వ తేదీ చివరి తేదీని అర్హులైన రైతులు ఆలస్యం చేయకుండా వెంటనే నమోదు చేసుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు.

## నూతన ఈవో సతీష్‌కుమార్‌కు ఉద్యమకారుల సన్మానం



అల్వాల్: శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయ నూతన ఈవోగా బాధ్యతలు స్వీకరించిన సతీష్ కుమార్‌ను తెలంగాణ ఉద్యమకారులు, జేఏసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు పటోళ్ల సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నూతన ఈవో సతీష్ కుమార్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనతో పాటు స్వామివారి ఆలయ ప్రతిష్ఠను మరింతగా పెంచేందుకు కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. నూతన బాధ్యతల్లో సతీష్ కుమార్ విజయవంతంగా రాణించాలని ఉద్యమకారులు, జేఏసీ నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పటోళ్ల సురేందర్ రెడ్డి, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర మాజీ సర్పంచుల సంఘం మరియు జేఏసీ ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ ముట్టడి

### సర్పంచుల పెండింగ్ బిల్లులు అడిగితే.. అక్రమ అరెస్టులా?

### రాష్ట్ర మాజీసర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు గంగిరెడ్డి బల్వంత్ రెడ్డి




అరుణ ప్రభ ఇబ్రహీంపట్నం : తెలంగాణ వ్యాప్తంగా గ్రామపంచాయతీలలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసి అప్పుల పాలైన మాజీ సర్పంచుల బాధలు వర్ణనాతీతమని సర్పంచుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జుఇ సర్పంచ్ రాయపోల్ గంగిరెడ్డి బల్వంత్ రెడ్డి.. అన్నారు. గ్రామాలలో అనేక అభివృద్ధి పనులు చేసి దేశంలోనే ఆదర్శవంతమైన గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దిన సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే, అక్రమ అరెస్టులు, గృహనిర్బంధాలు చేయడం హేయమైన చర్య అని అన్నారు. పెండింగ్ బిల్లులు ఇవ్వాలని మూడు సంవత్సరాల కాలంగా అడిగినా ఇవ్వకపోవడం సిగ్గుచేటు అని రాష్ట్రవ్యాప్తంగా ఆయాగ్రామలలో సర్పంచులు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన కోట్ల రూపాయలు బిల్లులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సర్పంచుల కుంటుంబాలు రోడ్డున పడే దాకా ప్రభుత్వం స్పందించదా అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈరోజు ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్ కు తరలించడం దారుణమని అన్నారు. వందల కోట్ల రూపాయల బకాయిలు ఉన్నాయన్నారు .సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, పెండింగ్ బిల్లులు విడుదల చేసేంతవరకు సర్పంచుల పోరాటం ఆగదని ఆయన తెలిపారు.



## చంద్రబాబు అరెస్టు ప్రజాస్వామ్యానికి చీకటి రోజు : టీడీపీ

ధర్మవరం, సెప్టెంబర్ 09; (అరుణ ప్రభ న్యూస్): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాక్షస పాలన కొనసాగిందని టీడీపీ నాయకులు ఆరోపించారు. చంద్రబాబు నాయుడు అరెస్టు జరిగి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ధర్మవరంలోని టీడీపీ కార్యాలయంలో 53 దీపాలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 2023 సెప్టెంబర్ 9న నంద్యాలలో చంద్రబాబు నాయుడిని అరెస్టు చేసి 53 రోజులపాటు జైలులో నిర్బంధించారని తెలిపారు. ఈ అరెస్టు రాజకీయ కక్షతోనే జరిగిందని ఆరోపించారు. చంద్రబాబు అరెస్టుతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమైందన్నారు. ప్రజా సమస్యలపై టీడీపీ బలంగా పోరాడుతుందని, చంద్రబాబు నాయకత్వంలో, నారా లోకేష్ ఆధ్వర్యంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## అమరావతి హాకీలో సత్యసాయి జిల్లా జట్ల సత్తా

ధర్మవరం, సెప్టెంబర్ 09; (అరుణ ప్రభ న్యూస్): తిరుపతిలో ఆగస్టు 24 నుంచి 27 వరకు నిర్వహించిన అమరావతి హాకీ ఛాంపియన్‌షిప్--2026లో సత్యసాయి జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటారు. అండర్--17 బాలికల విభాగంలో జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచి ఛాంపియన్‌గా అవతరించగా, అండర్--23 బాలుర జట్టు ద్వితీయ స్థానంతో రన్నరప్‌గా నిలిచింది. విజేత క్రీడాకారులను రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ అభినందించారు. బాలికల విజేత జట్టు, బాలుర రన్నరప్ జట్టు సభ్యులను శాలువాలతో సత్కరించారు. క్రీడలు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని మంత్రి అన్నారు. చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడాకారులకు శిక్షణ అందించిన కోచ్‌లు, పీఈటీలు, సిబ్బంది, తల్లిదండ్రులను కూడా అభినందించారు.

## జనసేన పార్లమెంట్ సహాయక బృందంలో అడ్డగిరి శ్యాం కుమార్



ధర్మవరం, సెప్టెంబర్ 09; (అరుణ ప్రభ న్యూస్): జనసేన పార్టీ హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ సహాయక బృందం సభ్యుడిగా ధర్మవరానికి చెందిన జనసేన నాయకుడు అడ్డగిరి శ్యాం కుమార్ ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల విధివిధానాలపై సమన్వయం కోసం పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ సహాయక బృందంలో శ్యాం కుమార్‌కు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు.

## దేవరకొండ నియోజకవర్గంలో వ్యవసాయ విద్యుత్ కు తీవ్ర అంతరాయం



నల్లగొండ జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు నరేందర్ రెడ్డి.అరుణ ప్రభ, డిండి ,సెప్టెంబర్ 9,,దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని అనేక గ్రామాలలో వ్యవసాయానికి విద్యుత్తు సరఫరా లో తీవ్ర ఇబ్బందులు రైతాంగం ఎదుర్కొంటుందని నల్గొండ జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు వానం నరేందర్ రెడ్డి ఒక ప్రకటనలో అన్నారు.వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తామని ,గత అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వము క్షేత్ర స్థాయిలో నిరంతరంగా విద్యుత్ అందడం లేదన్నారు. తక్కువ వోల్టేజ్, తరచూ విద్యుత్ ట్రిప్పింగ్, అకస్మా త్తుగా సరఫరా నిలిచిపోవడం, ట్రాన్స్ఫార్మర్లపై అధిక లోడు, విద్యుత్తులైన సమస్యలు కార ణంగా రైతుల వ్యవసాయ మోటరు సరిగా పనిచేయడం లేదని, పంటలకు నీరు అం దించాల్సిన కీలక సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రైతులు రాత్రి పగలు తేడా లేకుండా పొలాల వద్ద వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు .ప్రతి గ్రామంలో క్షేత్రస్థాయిలో విద్యుత్ సరఫరా పరిస్థితిని పరిశీలించి రైతులకు నాణ్యమైన విద్యుత్ 24 గంటలు అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



## ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించిన ఏఎస్‌డబ్ల్యూఓ

అరుణ ప్రభ, డిండి, సెప్టెంబర్ 9,దేవరకొండ నియోజకవర్గం పరిధిలోని దిండి మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని బుధవారం దేవరకొండ డివిజన్ ఏఎస్ డబ్ల్యూ ఓ జె.మల్లేశం సందర్శించారు.విద్యార్థులను చదువు పట్ల శ్రద్ధ చూపాలని, పరిశుభ్రతను పాటించాలని ,విద్యార్థులకు పలు సూచనలు చేశారు.తదుపరి విద్యార్థులతో కలిసి అల్పాహారం భుజించారు.అల్పాహారం పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ దిలీప్ కుమార్, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
గురువారం, సెప్టెంబరు 10, 2026

# తాత మధుపై చర్యలు తీసుకోవాలి



పెద్ద అంబర్‌పేట్ సెప్టెంబర్ 9 (అరుణ ప్రభ) శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బి-బ్లాక్ పరిధిలోని పెద్ద అంబర్‌పేట్, కుంట్లూర్ చౌరస్తాలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు చావు డప్పు కొట్టి నిరసన తెలిపారు. తాత మధును ఎమ్మెల్సీ పదవి నుంచి సస్పెండ్ చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర దళిత విభాగం పిలుపుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. మాజీ కౌన్సిలర్ గ్యారాల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బాటసింగారం సొసైటీ బ్యాంక్ చైర్మన్ కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బి-బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్. భాస్కర్‌చారి మాట్లాడుతూ.. శాసనసభ స్పీకర్ పదవి రాజ్యాంగబద్ధమైన అత్యున్నత హోదా అని అన్నారు. ఆ పదవిలో ఉన్న వ్యక్తిని వ్యక్తిగతంగా కించపరిచేలా మాట్లాడటం సభా మర్యాదకు, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దళిత వర్గానికి చెందిన వ్యక్తి కావడం వల్లే ఆయనను లక్ష్యంగా చేసుకుని అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. అధికారం కోల్పోయిన అసహనంతో బీఆర్ఎస్ నేతలు రాజ్యాంగ వ్యవస్థలను కించపరిచే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ రాజ్యాంగబద్ధ పదవుల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అన్ని పార్టీలపై ఉందన్నారు. క్షమాపణ చెప్పాలి స్పీకర్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులపై కూడా అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకుని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు, ఆయన కుటుంబ సభ్యులకు, దళిత సమాజానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తాత మధుపై శాసనపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని, శాసనసభ గౌరవాన్ని కాపాడేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ నాయకత్వం కూడా స్పందించి ప్రజలకు వివరణ ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు కార్యక్రమంలో పెద్ద అంబర్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు పండుగల రాజు, కుంట్లూర్ డివిజన్ అధ్యక్షుడు భీమగోని భాస్కర్ గౌడ్, పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధంకి కృష్ణారెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు రాజ్‌కుమార్, పాలడుగు నాగార్జున, సీనియర్ నాయకులు ఎరుకల భాస్కర్ గౌడ్, సుప్రసన్నారెడ్డి, చేగురు వెంకటేష్, రాజేంద్రప్రసాద్ గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయి గౌడ్, నర్సింగ్, శ్రీనివాసరెడ్డి, సుర్వి ప్రవీణ్ గౌడ్, గిరీష్, మహంత్, గుడ్ల రవి, శివ తదితరులు పాల్గొన్నారు.

# ఉప సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు చేయాలి

**అదనపు కలెక్టర్‌కు సర్పంచుల వినతి.**



ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 08 (అరుణప్రభ న్యూస్): గ్రామపంచాయతీల్లో ఉప సర్పంచ్‌లకు ఉన్న చెక్ పవర్‌ను రద్దు చేయాలని కోరుతూ రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వివిధ గ్రామాల సర్పంచులు బుధవారం అదనపు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అందె సుభాష్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీల అభివృద్ధి, పరిపాలనలో సర్పంచులపై ఉన్న బాధ్యతలకు అనుగుణంగా వారికి నిర్ణయాలు తీసుకునే విధంగా పూర్తి అధికారాలు కల్పించాలని కోరారు. ఉప సర్పంచ్‌లకు చెక్ పవర్ ఉండటం వల్ల గ్రామపంచాయతీల పరిపాలనలో పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. గ్రామపంచాయతీల అభివృద్ధి పనులు సకాలంలో చేపట్టి పూర్తి చేసేందుకు వీలుగా ఉప సర్పంచ్‌ల చెక్ పవర్‌ను రద్దు చేసి, సర్పంచులకు పూర్తి బాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు సర్పంచులు పాల్గొన్నారు.

# నేటి విద్యార్థులు, యువత కాళోజీని స్ఫూర్తిగా తీసుకోవాలి

## ప్రజాకవి కాళోజీ ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలి



ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 09 (అరుణప్రభ న్యూస్): ప్రజల కోసం తపించి, ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి తన కలాన్ని ఆయుధంగా మలచుకున్న ప్రజాకవి, మానవతావాది కాళోజీ నారాయణరావును నేటి విద్యార్థులు, యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. పద్మావతి పిలుపునిచ్చారు. కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని సెప్టెంబర్ 9న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి నివాళులర్పించి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్. పద్మావతి మాట్లాడుతూ.. కాళోజీ నారాయణరావు తెలంగాణ యాస, భాషలో రచనలు చేసి తెలంగాణ సంస్కృతి, ప్రజల జీవన విధానాన్ని తన రచనల్లో ప్రతిబింబించారని అన్నారు. తెలంగాణ కోసం ఉద్యమించడంతో పాటు ఉపాధ్యాయ శాసనమండలి సభ్యుడిగా ప్రజలకు సేవలందించారని తెలిపారు. నిత్యం ప్రజల సమస్యలపై స్పందిస్తూ, ప్రజల హక్కులు, సామాజిక చైతన్యం కోసం నిరంతరం పరితపించిన గొప్ప మానవతావాది కాళోజీ అని కొనియాడారు.

**కాళోజీ రచనలు యువతకు స్ఫూర్తిదాయకం**

జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి, రచయిత వాసరవేణి పరశురాములు మాట్లాడుతూ.. కాళోజీ నారాయణరావు రచనలు సమాజాన్ని ప్రశ్నించేలా, ప్రజలను ఆలోచింపజేసేలా ఉంటాయని అన్నారు. ఆయన రచించిన 'నా గొడవ', 'జీవన గీతిక', 'బాపు బాపు బాపు', 'కాళోజీ కథలు' తదితర రచనలు, తెలంగాణ ఉద్యమ కవితలు ప్రజల్లో చైతన్యాన్ని రగిలించాయని పేర్కొన్నారు. కాళోజీ నారాయణరావు సాహిత్య, సామాజిక సేవలకు గుర్తింపుగా పద్మ విభూషణ్ పురస్కారం అందుకున్నారని తెలిపారు. తన మరణానంతరం తన దేహాన్ని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి దానం చేసి, సేవా భావాన్ని చాటుకున్న మహనీయుడని అన్నారు. కాళోజీ జీవితం, ఆయన సాహిత్యం, ప్రజా ఉద్యమాల పట్ల ఆయన నిబద్ధత నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు కాళోజీ రచనలను చదివి ఆయన ఆలోచనా విధానాన్ని అర్థం చేసుకోవాలని, సమాజంలోని సమస్యలపై స్పందించే బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని సూచించారు. తెలంగాణ భాష, యాస, సంస్కృతి పరిరక్షణలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు క్యాతం సత్యనారాయణ, మాదాసు చంద్రమౌళి, చెరుకు భూమక్క, బుట్ట కవిత, నీరటి విష్ణు ప్రసాద్, జ్యోతోతు శ్రీనివాస్, వెల్దండి సౌమ్య, బోధనేతర సిబ్బంది విమల్ కుమార్, కనిమేని దేవేందర్, షాహినా సుల్తానా, నిఖిల్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సినిమా షూటింగ్‌ల నిలయంగా పాలకుర్తి ప్రాంతం

**అరుణ ప్రభ పాలకుర్తి సెప్టెంబర్**



పాలకుర్తి నియోజకవర్గం సినీ చిత్రీకరణలకు వేదికగా మారుతోంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో సినిమా షూటింగ్‌లు జరుగుతుండగా, తాజాగా పాలకుర్తి మండల కేంద్రంలోని తిరుమల సినిమా హాల్‌లో సినిమా చిత్రీకరణ కొనసాగుతోంది.కార్తీక్ రాజు, కాజల్ చౌదరి హీరో హీరోయిన్లుగా, గాలి కృష్ణ, శ్రీరామ కృష్ణ నిర్మాతలుగా, కెమెరామెన్ చరణ్, మహేష్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రొడక్షన్ నెంబర్ 1 తాత్కాలిక పేరు సినిమా షూటింగ్‌లో భాగంగా స్థానిక తిరుమల సినిమా హాల్‌లో సన్నివేశాలను చిత్రీకరించారు.వేటగాడు సినిమా చూసేందుకు వచ్చిన ప్రేక్షకుల మధ్య హీరో, హీరోయిన్ల మధ్య జరిగే సంభాషణ సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ షూటింగ్‌లో సినిమా మేనేజర్ సుబ్బారావు, ప్రొడక్షన్ మేనేజర్ మేడారపు సుధాకర్, సహాయకులు కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.అదేవిధంగా దేవిశ్రీ ప్రసాద్ హీరోగా నటిస్తున్న ఎల్లమ్మ సినిమా షూటింగ్ కూడా పాలకుర్తి నియోజకవర్గంలో ప్రారంభం కానుంది. మరో రెండు రోజుల్లో సినిమా చిత్రీకరణ ప్రారంభం కానున్న నేపథ్యంలో కొండాపురం, కోలనపల్లి గుట్టలు, పర్వతగిరి ప్రాంతాల్లోని లొకేషన్లను దర్శకుడు బలగం వేణు, ఆర్ట్ డైరెక్టర్ రామాంజనేయులు, ప్రొడక్షన్ మేనేజర్ మేడారపు సుధాకర్ మరోసారి పరిశీలించారు. అనంతరం సెట్ వర్క్‌ను ప్రారంభించారు.పాలకుర్తి ప్రాంతంలో అద్భుతమైన సహజ లొకేషన్లు ఉన్నాయి. భవిష్యత్తులో ఈ ప్రాంతం మరింతగా సినిమా షూటింగ్ స్పాట్‌గా మారే అవకాశం ఉంది అని ప్రొడక్షన్ మేనేజర్ మేడారపు సుధాకర్ తెలిపారు. దళిత స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు ఖండించాలి.అరుణ ప్రభ, డిండి ,సెప్టెంబర్ 9 ,దళిత స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదని డిండి పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు మల్లేష్ నాయక్ అన్నారు .అసెంబ్లీలో దళిత స్పీకర్ పై బి ఆర్ఎస్ ఎమ్మెల్సీ లు చేసిన అనుచిత వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నతమైన శాసనసభలో స్పీకర్ పదవికి గౌరవం ఇవ్వవలసిన బాధ్యత ప్రజాప్రతినిలపై ఉందన్నారు

# ప్రజా చైతన్య ప్రదాత కాళోజీ

**సామాజిక, రాజకీయ చైతన్యానికి ఆయన సాహిత్యం స్ఫూర్తిదాయకం**

**అరుణప్రభ ప్రతినిధి**

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 09: తెలంగాణ ప్రజల్లో సామాజిక, రాజకీయ చైతన్యాన్ని తీసుకురావడంలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు చేసిన కృషి మరువలేనిదని మొక్కల ప్రేమికుడు దుంపెన రమేష్, సీనియర్ జర్నలిస్ట్ బండారి బాల్‌రెడ్డి అన్నారు. తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సామాజిక సమస్యలపై నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా స్పందించడం కాళోజీ నారాయణరావు ప్రత్యేకత అని అన్నారు. ప్రజా సమస్యలపై తన కలంతో పోరాడిన ఆయన, సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని చిన్న వయసులోనే జైలు జీవితం అనుభవించారని తెలిపారు. విద్యార్థి దశ నుంచే నిజాం ప్రభుత్వ నిషేధాజ్ఞలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప ప్రజా నాయకుడిగా కాళోజీని కొనియాడారు. తెలంగాణ సాధన ఉద్యమంలో కాళోజీ సాహిత్యం ప్రజల్లో స్ఫూర్తిని, చైతన్యాన్ని నింపిందని పేర్కొన్నారు. ఆయన రచనలు నేటి సమాజానికి కూడా ఎంతో ప్రేరణనిస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ కాళోజీ రచనలను చదివి ఆయన ఆశయాలను తెలుసుకోవాలని, ముఖ్యంగా యువత కాళోజీ ఆలోచనా విధానాన్ని స్ఫూర్తిగా తీసుకొని సమాజ శ్రేయస్సు కోసం ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చెన్ని బాబు, నాయకులు సిరిపురం మహేందర్, బాలగౌడ్, నాగరాజు తదితరులు పాల్గొని కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



# అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించాలి

**బొల్లిగూడెంలో భూ రక్షణ సమితి సమన్వయ సమావేశం**

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య**

**కాంగ్రెస్ దళితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి**

**రాష్ట్రవ్యాప్తంగా అసైన్డ్ రైతులకు పాస్ పుస్తకాలు అందించాలి**



సెప్టెంబర్ 9, అరుణ ప్రభ....

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా బోడుప్పల్ సర్కిల్ బొల్లిగూడెం పరిధిలో తెలంగాణ భూ రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల భూ రక్షణ సమితి ప్రతినిధులు పాల్గొన్న ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, అసైన్డ్ రైతుల యజమాన్య హక్కులపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన చేవెళ్ల దళిత డిక్లరేషన్ నెరవేర్చాలని, అసైన్డ్ భూముల దళిత రైతులకు యాజమాన్య హక్కులు కల్పించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు పూర్తయినప్పటికీ అసైన్డ్ భూముల ఊసే లేదని, కాంగ్రెస్ పార్టీ అధినాయకుడు రాహుల్ గాంధీ, మల్లికార్జున కార్ గే చేసిన వాగ్దానాన్ని సైతం రేవంత్ సర్కార్ విస్మరించిందని మండిపడ్డారు. భూ రక్షణ సమితి చేస్తున్న పోరాటాలను దృష్టిలో పెట్టుకొని కోనేటి రంగారావు రైతు కమిషన్ లను పరిగణలోకి తీసుకొని వెంటనే అసైన్డ్ భూమి ఉన్న దళిత రైతులందరికీ యాజమాన్య హక్కులు కల్పించి పాస్ పుస్తకాలు అందించాలని తెలంగాణ భూ రక్షణ సమితి డిమాండ్ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం దళిత రైతులపై ఇదే ధోరణి వ్యవహరిస్తే భూ రక్షణ సమితి తమ నిరసనలను మరింత ఉధృతం చేస్తుందని బుగ్గ మైసయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చింత స్వామి సలహదారులు,, మిద్దపాక సిద్ధులు, ఉపాధ్యక్షుడు,డప్పు వీరస్వామి లీగల్ సెల్, కొమ్ము సామెల్ ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ఇన్చార్జ్, చౌడగారి సంజు సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు,, మారెళ్ళ మహేష్ , తొట్టె కుమార్, తుల్జారాం, వేముగంటి వెంకటస్వామి సిద్దిపేట జిల్లా ఇంచార్జ్, డ్యాగా సాయన్న, నిజామాబాద్ జిల్లా ఇన్చార్జ్, ఎర్రబోతు కనకయ్య, ఎడ్ల తెలంగాణ యూనివర్సిటీల ఇంచార్జ్, దబెకర్ మధు, యువజన విభాగం రాష్ట్ర కన్వీనర్ రాపోలు శ్రీరాములు, చిలుక స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు

**కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్.**



ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 09 (అరుణప్రభ న్యూస్): సిరిసిల్ల జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం శ్రీ కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరై కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. కాళోజీ నారాయణరావు తన రచనలు, కవిత్వం ద్వారా నాటి సామాజిక పరిస్థితులను ప్రతిబింబిస్తూ ప్రజల్లో చైతన్యాన్ని తీసుకొచ్చారని అన్నారు. తెలంగాణ భాష, యాస, సంస్కృతిపై కాళోజీకి ఉన్న అభిమానం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కాళోజీ నారాయణరావు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజల సమస్యలు, సామాజిక అంశాలను తన రచనల ద్వారా వెలుగులోకి తీసుకువచ్చిన కాళోజీ సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ార్యక్రమంలో సీపీఓ శ్రీనివాస చారి, ఏడీ మైన్స్ క్రాంతి కుమార్, డీవైఎస్ఓ రాందాస్, పరిశ్రమల శాఖ జీఎం హన్మంతు, జిల్లా వైద్యాధికారి ఏంజెలా అల్ఫ్రెడ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, కలెక్టరేట్ పర్యవేక్షకులు ఉమారాణి, వైశాలి తదితరులు పాల్గొన్నారు

## బిజెపి పార్టీకి సాయికుమార్ సేవలు మరువలేనివి

**విగ్రహావిష్కరణలో నేషనల్ ఎస్టీ కమిషన్ మెంబర్ హుస్సేన్ నాయక్**

అరుణప్రభ 9 సెప్టెంబర్ మహబూబాబాద్ మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలో బీజేపీ కార్యకర్తగా పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన దివంగత అల్లం సాయి కుమార్ విగ్రహాన్ని ఆవిష్కరించిన జాతీయ ఎస్టీ కమిషన్ (ఎన్ సి ఎస్ టి )సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్ ఈ కార్యక్రమంలో తనతో పాటు మాజీ రాజ్యసభ సభ్యులు గరికిపాటి మోహన్ రావు ఎర్రబెల్లి ప్రదీప్ రావు మహబూబాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షులు వల్లభు వెంకటేశ్వర్లు జిల్లా నాయకులు, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు పార్టీ కోసం అంకితభావంతో సేవలందించిన సాయి కుమార్ సేవలు, త్యాగాలు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి..



# ప్రజాకవి కాళోజీ నారాయణరావు ఆశయాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలి

**ఘనంగా ప్రజాకవి కాళోజీ నారాయణరావు 112వ జయంతి వేడుకలు**

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**

**అరుణప్రభ 9 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్**

తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా ప్రజాకవి కాళోజీ నారాయణరావు 112వ జయంతి వేడుకలను బుధవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ హాజరై, కాళోజీ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి, ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజాకవి కాళోజీ తెలంగాణ ఆత్మను, ప్రజల జీవనాన్ని, సామాజిక స్పృహను తన కవిత్వంలో ప్రతిబింబించిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. తెలుగు మాత్రమే కాకుండా ఉర్దూ, హిందీ, మరాఠీ, ఆంగ్లం, తదితర భాషల్లో కూడా కవితలు రచించిన బహుభాషా కోవిదుడిగా కాళోజీ నిలిచారని తెలిపారు సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాటం చేసిన ప్రజా కవిగా కాళోజీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై స్పందిస్తూ ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు కాళోజీ చేసిన కృషి అందరికీ ఆదర్శమని అన్నారు. కాళోజీ సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 1992లో పద్మ విభూషణ్ పురస్కారాన్ని ప్రదానం చేసిందని గుర్తు చేశారు. ఒకసారి ఎమ్మెల్యేగా సేవలందించిన కాళోజీ ప్రజా సంక్షేమానికే ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు



జీవితాంతం మానవతా విలువలను ఆచరించిన కాళోజీ, మరణానంతరం కూడా తన అవయవాలను దానం చేసి సమాజానికి ఆదర్శంగా నిలిచిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కాళోజీ ఆశయాలు, మానవతా దృక్పథం, సామాజిక న్యాయం కోసం చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని పిలుపునిచ్చారు అదే విధంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, అధికారులు, కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ఐడీఓసీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కుటుంబం నుంచి తొలి డాక్టరేట్

## గర్జనపల్లి యువకుని ప్రతిభ. వృక్షశాస్త్రంలో పీహెచ్‌డీ సాధించిన గజ్జెల రాజేందర్.

**అరుణప్రభ న్యూస్ -- వీర్నపల్లి.**

వ్యవసాయ కుటుంబంలో పుట్టి కష్టపడి చదువుకొని వృక్షశాస్త్రంలో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పట్టా పొందిన గజ్జెల రాజేందర్ తన ప్రతిభను చాటుకున్నారు. గర్జనపల్లి గ్రామానికి చెందిన యువకుడు డాక్టరేట్ సాధించడం గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామానికి చెందిన గజ్జెల భూమయ్య--మల్లవ్వ దంపతులకు ముగ్గురు సంతానం. వ్యవసాయ పనులు చేసుకుంటూనే తమ పిల్లలను ఉన్నతంగా చదివించాలనే సంకల్పంతో వారు ఎన్నో కష్టాలను ఎదుర్కొని విద్యను అందించారు. వారి కుమార్తె కవిత ఫారెస్ట్ బీట్ అధికారిగా, పెద్ద కుమారుడు కరుణాకర్ పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. చిన్న కుమారుడు గజ్జెల రాజేందర్ తాజాగా పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. రాజేందర్ ప్రాథమిక విద్యను గర్జనపల్లి ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి వరకు పూర్తి చేశారు. అనంతరం 6వ తరగతి నుంచి ాూాౌ=జీజ హుస్నాబాద్‌లో, ఇంటర్మీడియట్‌ను ాూాౌ=జీజ మేడిపల్లిలో, డిగ్రీని ా== కళాశాల కరీంనగర్‌లో పూర్తి చేశారు. అనంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లో ఎంఎస్సీ (బోటనీ), పీహెచ్‌డీ (బోటనీ) పూర్తి చేశారు. గైడ్ ప్రొఫెసర్ కమలాకర్ పర్యవేక్షణలో “జుటటవష్ శీట ణబతీస్త్రుఎ జష్ట్రవతీబజబ ఔవతీ శీఅ ాశీఎవ ాావశ్రీవష్వస ఎవస్త్రుఎశ్రీవ జతీశీజూం అఅ ఙఖఅస్త్రుతీవుఎఎ ణఅరతీఅష్, ఎవశ్రీఖఅస్త్రుఖఖు” అనే అంశంపై పరిశోధన చేసి పీహెచ్‌డీ పూర్తి చేశారు.




హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించిన స్నాతకోత్సవంలో తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, భారత్ బయోటెక్ చైర్మన్ డాక్టర్ కృష్ణ ఎం. ఎల్లా చేతుల మీదుగా రాజేందర్ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన రాజేందర్ ఉన్నత విద్యలో రాణించి డాక్టరేట్ సాధించడం పట్ల గర్జనపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన పట్టుదల, కృషి గ్రామంలోని యువతకు స్ఫూర్తిదాయకమని పలువురు

# అన్యాయానికి అసమానతలకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి కాళోజి నారాయణరావు

**జయంతి సందర్భంగా నివాళులర్పించిన డిఎస్పి తిరుపతిరావు ఘనంగా కాళోజి వాకర్స్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు**

**అరుణప్రభ 9 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్**

కాళోజీ నారాయణ రావు జయంతి వేడుకలను సెప్టెంబర్ 9, 2026న మహబూబాబాద్ జిల్లా కేంద్రం లోని స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఉదయం ఏడు గంటలకు కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి వాకర్ అసోసియేషన్ అధ్యక్షులు నామిరెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా మహబూబాబాద్ డిఎస్పి యన్. తిరుపతి రావు హాజరై మాట్లాడుతూ కాళోజీ నారాయణ రావు జీవితమంతా తెలంగాణకే అంకితం చేసిన వ్యక్తి అని, కాళోజీ నిజాం నిరంకుశ ప్రభుత్వం కొనసాగిస్తున్న ప్రజా వ్యతిరేక పరిపాలనకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి అని, వారి రచనలు ఎల్లప్పుడూ అన్యాయానికి, అసమానతలకు వ్యతిరేకంగా ఉండేవి అని వారు 69 ఉద్యమంలోనూ, 96 లో ప్రారంభమైన తెలంగాణ ఉద్యమంలో కూడా చెరుకుగా పాల్గొన్నారని అన్నారు కాళోజీ వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ డోలి సత్యనారాయణ గారు మాట్లాడుతూ కాళోజి జయంతి సందర్భంగా వారిని మనము గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని, మహనీయులను వారి జయంతి, వర్ధంతు ల సందర్భంగా వారు సమాజానికి వారు అందించినటువంటి విలువలను, ఆదర్శాలను, స్ఫూర్తిదాయక రచనలను గుర్తుచేసుకొని, వాటిని భావితరాలకు అందించవలసిన బాధ్యత వాకర్స్ అసోసియేషన్ సభ్యులుగా మనందరిపై ఉందని అన్నారు. అలాంటి వారిలో కాళోజీ గారు ఒకరిని, వారి రచనల్లో ప్రముఖమైనది నా గొడవ పుస్తకమని, అందులో అన్యాయాన్ని ఎదిరించిన వాడే నా స్నేహితుడని కాళోజి అన్నారని గుర్తు చేశారు విశిష్ట అతిథిగా ఖమ్మం ఎక్సైజ్ సిఐ చిరంజీవి మాట్లాడుతూ కాళోజి వాకర్స్ అసోసియేషన్ అనేక సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు ఆరోగ్యపరమైన అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని, ఈ




వాకర్స్ అసోసియేషన్ కు నా వంతు సహకారము అందిస్తానని అన్నారు ఇంకనూ ఈ సమావేశంలో వాకర్ అసోసియేషన్ గౌరవ సలహాదారులు మైస నాగయ్య, మైస శ్రీనివాస్, కార్యదర్శి పట్టాభి లక్ష్మయ్య, కోశాధికారి సోమ విష్ణువర్ధన్, పెద్ది వెంకన్న, జిలకర శ్రీహరి, నేతుల వెంకన్న,బి రాజు, జగదీష్, వీరేందర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, ఉపేందర్, మల్లారెడ్డి, వేముల రవీందర్, ఎస్ శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్, నరేష్ రెడ్డి, మహేందర్ రెడ్డి, తోలిం వెంకటేశ్వర్లు, కమలాకర్, రాజన్న, రాంబాబు, మేడ వెంకటేశ్వర్లు, పగడయ్య, నల్లు దేవేందర్ రెడ్డి, దామోదర్, మధుకర్, విద్యాసాగర్,మల్లయ్య, లక్ష్మీనారాయణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ తాతా మధు, నవీన్ రెడ్డిల సభ్యత్వాన్ని రద్దు చేయాలి

**తెలంగాణ శాసనసభ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలకు తీవ్రంగా ఖండిస్తున్నాం**

**దళిత ద్రోహి కేసీఆర్, దళితుల జోలికొస్తే ఖబర్దార్ - బోడుప్పల్ ఫెడరేషన్ చైర్మన్, డాక్టర్ రాపోలు రాములు**

సెప్టెంబర్ 9, అరుణ ప్రభ... తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత, అహంకారపూరిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ బోడుప్పల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో భారీ నిరసన తెలియజేశారు. రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవిలో ఉన్న తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారిపై ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయడం అత్యంత ఖండనీయమని పేర్కొన్నారు, ఇలాంటి ప్రవర్తన శాసనమండలి సభ్యుని హోదాకు ఏమాత్రం తగదు శాసనసభపతి గౌరవం అధికారం రాజ్యాంగం బద్ధ హోదాకు ఇది తీవ్ర భంగం కలిగిస్తుంది,రాజ్యాంగబద్ధమైన తెలంగాణ శాసనసభ స్పీకర్ పదవిని అవమానించేలా వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు,నవీన్ రెడ్డి వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఫాడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు.శాసనసభ గౌరవాన్ని కించపరిస్తే ఫెడరేషన్ చూస్తూ ఊరుకోదు, వెంటనే సభ్యత్వాన్ని రద్దు చేయాలని ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ సంస్థల గౌరవాన్ని కాపాడేందుకు నిరంతరం పోరాడుతుంది ప్రజాస్వామ్యంలో ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయడం మీరు ప్రజలకిచ్చే సందేశం ఇదేనా ప్రజాస్వామ్యంలో ఇంకా కుల దుహంకార వ్యవస్థ నడవడం దేవస్థానం భ్రష్టు పట్టిస్తుందని ఇలాంటివి ఉపేక్షించలేమని వీరిపైన తగిన చర్యలు తీసుకోవాలని



డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ వైస్ చైర్మన్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, ఫెడరేషన్ అధ్యక్షుడు అబ్రహం లింకన్, ప్రధాన కార్యదర్శి గడ్డం యాదగిరి, కోశాధికారి బజ్జూరి శ్రీనివాస్ గుప్త, బొల్లారం మహేష్ , మధుసూదన్, రామచంద్రం, రామకృష్ణారెడ్డి, ఎర్ర యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల పక్షాన నిలిచిన ప్రజాకవి కాలోజీ నారాయణ రావు

**ముున్సిపల్ కార్యాలయంలో కాళోజి చిత్రపటానికి నివాళులర్పించిన చైర్పర్సన్ కమిషనర్**



అరుణప్రభ 9 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో కాళోజి నారాయణ రావు 112వ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించిన మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ గుగులోతు జ్యోతి రమేష్ నాయక్ వైస్ చైర్మన్ సుర్ణపు సోమయ్య చైర్మన్ మాట్లాడుతూ తెలంగాణ నేలపై ప్రజల గొంతుకగా, అన్యాయాన్ని ప్రశ్నించిన ధైర్యవంతుడిగా, సామాజిక చైతన్యానికి ప్రతీకగా నిలిచిన మహనీయుడు కాళోజి నారాయణరావు ఆయన కేవలం కవి మాత్రమే కాదు ప్రజల కష్టాలను తన కవిత్వంలో ప్రతిబింబించిన ప్రజా ఉద్యమకారుడు, ప్రజాస్వామ్య విలువల కోసం జీవితాంతం పోరాడిన చైతన్యవాది కాళోజి కలం అధికారాన్ని ప్రశ్నించింది అణగారిన వర్గాల బాధలను సమాజం ముందు నిలబెట్టింది తెలంగాణ సమాజంలో స్వాభిమానం, భాష, సంస్కృతి, హక్కులపై చైతన్యం పెంపొందించడంలో కాళోజి పాత్ర చిరస్మరణీయం. ఆయన మాటల్లోని నిబద్ధత, రచనల్లోని ఆవేదన, పోరాటంలో కనిపించిన ధైర్యం నేటి తరానికి గొప్ప స్ఫూర్తి... ఈ యొక్క కార్యక్రమంలో పట్టణ పలు వార్డుల కౌన్సిలర్లు, బొల్లు రాజు,నిమ్మల శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, వినోద్ కుమార్ , మున్సిపల్ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా డీజేలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు.

**గణేష్ ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదు. ఎల్లారెడ్డిపేట ఎస్ఐ ఎన్. రమేష్ హెచ్చరిక.**




అరుణప్రభ న్యూస్ -- ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 9: గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎల్లారెడ్డిపేట మండల పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా డీజేలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎల్లారెడ్డిపేట సబ్‌ఇన్‌స్పెక్టర్ ఎన్. రమేష్ హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని డీజే యజమానులతో ఎస్ఐ రమేష్ సమావేశం నిర్వహించారు. పోలీసుల సూచనలను బేఖాతరు చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా డీజేలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణేష్ మండపాల వద్ద కానీ, శోభాయాత్రల్లో కానీ డీజేలు, అధిక శబ్దాలు చేసే యాంప్లిఫైయర్లు, బాక్సులు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే డీజే యజమానులతో పాటు నిర్వాహకులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గణేష్ మండపాల వద్ద పోలీసుల అనుమతితో చిన్న స్పీకర్లు మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని, అవి కూడా రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించాలని సూచించారు. అధిక శబ్దాలతో కూడిన డీజేల వల్ల చిన్నారులు, విద్యార్థుల చదువుకు ఆటంకం కలగడంతో పాటు వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారికి ఇబ్బందులు కలిగే అవకాశం ఉందన్నారు. అందువల్ల ఎల్లారెడ్డిపేట మండల పరిధిలో గణేష్ ఉత్సవాల సందర్భంగా డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని ఎస్ఐ రమేష్ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి డీజేలు నిర్వహించే వారిపై ఎలాంటి మినహాయింపులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా, సమావేశానికి హాజరైన డీజే యజమానులను గౌరవ తహసీల్దార్ (ఎమ్మార్వో) సమక్షంలో బైండోవర్ చేసినట్లు పోలీసులు తెలిపారు. గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని ఎస్ ఐ రమేష్ కోరారు.

# ఘనంగా ఎమ్మెల్సీ రవీందర్ రావు జన్మదిన వేడుకలు

**అరుణప్రభ 9 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్**

మహబూబాబాద్ జిల్లా కేంద్రం లోని స్థానిక గౌతమి జూనియర్ కాలేజ్ లో ప్రముఖ విద్యావేత్త ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు జన్మదిన వేడుకలు నిర్వహించిన డైరెక్టర్ తక్కెళ్లపల్లి సంధ్యారాణి ప్రిన్సిపల్ అరుణ్ కుమార్ ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డాక్టర్ తక్కెళ్లపల్లి దృశ్యంత్ రావు పాల్గొని కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం పాల్గొన్నారు



# సిరులకు కేరాఫ్.. సెరికల్చర్!

నిన్న మొన్నటిదాకా.. 'వ్యవసాయం' అంటే వరి లేదా పత్తి అన్నట్లే ఉండేది. కానీ, ప్రస్తుతం పరిస్థితి మారుతున్నది. సంప్రదాయ సాగుతోపాటు.. లాభదాయకమైన పంటలపై కర్షకుల 'పట్టు' పెరుగుతున్నది. ఈ క్రమంలో 'సెరికల్చర్'.. సిరులకు కేరాఫ్‌గా నిలుస్తున్నది. నెలనెలా ఆదాయాన్ని అందిస్తూ.. రైతును రాజుగా మారుస్తున్నది. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రోత్సాహంతో రైతులు లాభదాయకమైన పంటలపై దృష్టి పెడుతున్నారు. సంప్రదాయానికి భిన్నంగా.. వ్యవసాయంలోనూ నెల నెలా ఆదాయం వచ్చేలా చూసుకుంటున్నారు. ఈ క్రమంలో మంత్రి హరీశ్‌రావు ప్రోత్సాహంతో సిద్దిపేట జిల్లా రైతులు 'పట్టుసాగు'లో రాణిస్తున్నారు. 17 మండలాల్లో వెయ్యి ఎకరాల్లో పట్టు సాగు చేస్తున్నారు. మరోవైపు పట్టు పరిశ్రమ కూడా సబ్సిడీలతో రైతులను ప్రోత్సహిస్తున్నది. ఓసీ, బీసీలకు 50 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 65 శాతం వరకూ సబ్సిడీలు, రుణాలు అందిస్తున్నది. వీటిని సద్వినియోగం చేసుకుంటున్న రైతులు.. పట్టుసాగుతో అధిక లాభాలు పొందుతున్నారు. రాష్ట్రంలోనే పట్టు సాగులో సిద్దిపేట జిల్లా ముందంజలో ఉన్నదని సంబంధిత శాఖ అధికారులు పేర్కొంటున్నారు.





### ఏడాదికి పది పంటలు

పట్టు పురుగుల పంటకాలం నెల రోజుల్లోనే పూర్తవుతుంది. ఈ లెక్కన ఏడాదికి తొమ్మిది నుంచి పది పంటలు తీసే అవకాశం ఉన్నది. సిద్దిపేట జిల్లాకు చెందిన రైతులు బెంగళూరు నుంచి పట్టుగుడ్లను తెప్పిస్తున్నారు. ఇందుకోసం వంద గుడ్లకు రూ. 800తో కొనుగోలు చేస్తున్నారు. ఈ పట్టుగుడ్లను నల్లని బట్ట లేదా పేపర్ చట్రాలలో పొదిగేస్తారు. ఒక్కో గుడ్డు నుంచి 500లకు పైగా పిల్లలు బయటికి వస్తాయి. ఈ పురుగులను పెంచడానికి ప్రత్యేకంగా షెడ్‌లు నిర్మించుకోవాల్సి ఉంటుంది.

### మేతగా మల్బరీ ఆకు

మొత్తం ఐదు దశల్లో పట్టు పురుగుల పెంపకం కొనసాగుతుంది. వీటికి మల్బరీ ఆకులను మేతగా వేస్తారు. ప్రతి మూడు రోజులకు ఒకసారి పట్టు పురుగు నిద్రలోకి వెళ్తుంది. ఈ సమయంలో పాత చర్మం పోయి కొత్త చర్మం వస్తుంది. పురుగు పెరిగే కొద్దీ మేతను ఎక్కువగా తీసుకుంటుంది. చివరి దశలో రోజుకు రెండుసార్లు మేత వేయాల్సి ఉంటుంది. నాలుగో దశ తర్వాత కండెకు వస్తుంది. మొత్తంగా పట్టు పురుగుల పంటకాలం 21 రోజుల నుంచి 25 రోజుల్లో పూర్తవుతుంది. కండెకు వచ్చిన పురుగును వేరుచేసి, మార్కెట్‌కు తరలిస్తారు. ప్రస్తుతం కిలోకు రూ. 700 నుంచి రూ.750 వరకు ధర పలుకుతున్నది. ఒక రైతు 250 గుడ్లతో పట్టు పురుగుల పెంపకం చేపడితే.. రూ.లక్షకు పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉన్నది. పెట్టుబడి ఖర్చులు రూ. 10 వేలు తీసేసినా.. రూ. 90 వేల దాకా మిగులుతుంది.

### రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహం

పట్టు పురుగులు పెంచుతున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తున్నది. షెడ్ నిర్మాణానికి, మొక్కలు నాటడానికి, ఇతర పరికరాలు సమకూర్చుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఓసీ, బీసీలకు 50 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 65 శాతం సబ్సిడీని అందిస్తున్నది. యూనిట్ ధర రూ.4 లక్షలు ఉండగా, ఇందులో 50 శాతం సబ్సిడీ ఉంటుంది. రెండు ఎకరాలలో మొక్కలు నాటడానికి రూ. 25,000, రేరింగ్ షెడ్ నిర్మాణానికి రూ. 2,00,00 ప్రభుత్వం నుంచి సబ్సిడీగా వస్తుంది. ఎస్సీ, ఎస్టీలకు మొక్కలు నాటడానికి రూ.32,500, రేరింగ్ షెడ్ నిర్మాణానికి 2,60,00 అందిస్తున్నది. ఉపాధిహామీ పథకంలో మొక్కలు నాటడానికి ఒక్కో రైతుకు కూలీలకుగాను రూ.36,508, రేరింగ్ షెడ్ నిర్మాణానికి రూ.4,580 ఇస్తున్నది. మెటీరియల్ పేమెంట్ కింద మొక్కలు నాటడానికి రూ. 3,270, రేరింగ్ షెడ్ నిర్మాణానికి రూ.88,845 అందిస్తున్నది. అంటే ఒక్క రైతుకు మొత్తంగా పట్టు పరిశ్రమ శాఖ నుంచి ఓసీ, బీసీలకు రూ.2,25,000, ఉపాధిహామీ నుంచి రూ.1,32,843.. మొత్తంగా రూ.3,57,843 అందుతున్నది. ఎస్సీ, ఎస్టీలకు పట్టుపరిశ్రమ శాఖ నుంచి రూ. 2,92,500, ఉపాధిహామీ నుంచి రూ. 1,32,843.. మొత్తంగా రూ. 4,25,343 సబ్సిడీల రూపంలో అందుతున్నది.



## మూతిపుండు.. జీవాలకు గండం!

మూతిపుండు వ్యాధి జీవాలను ఎక్కువగా ఇబ్బంది పెడుతుంది. 'పారాపాక్స్ వైరస్'తో ఈ వ్యాధి సోకుతుంది. ఈ సూక్ష్మజీవులు చర్మపు పొక్కుల్లో నివాసం ఉంటాయి. జీవాల పెదవులపైనా, నోటిలో గాయాలైనప్పుడు శరీరంలోకి ప్రవేశిస్తాయి.

**వ్యాధి లక్షణాలు :** వ్యాధికి గురైన జీవాల పెదాలు, ముఖంపైన పొక్కులు కనిపిస్తాయి. వ్యాధి ముదిరేకొద్దీ.. పొక్కులు పెదవులంతా వ్యాపిస్తాయి. ఫలితంగా జీవాలు మేత తీసుకోవడానికి ఇబ్బంది పడతాయి. నాలుగు నుంచి ఐదు నెలల గొర్రెలు, మేక పిల్లలు ఈ వ్యాధికి ఎక్కువగా గురవుతుంటాయి. పెద్దజీవాల్లో వ్యాధి అంతగా వ్యాపించదు.

**చికిత్స :** ముందుగా జీవాల నోటిపై ఏర్పడ్డ పుండ్లను పర్మాంగనేట్ ద్రావణంతో శుభ్రం చేయాలి. పశువైద్యుడిని సంప్రదించి, యాంటీబయోటిక్ మందులను వాడాలి. వ్యాధికి గురైన జీవాలకు తేలికగా అరిగే గంజిని తాగించాలి.

## అల్లం వ్యాపారంలో ఆదర్శం!

వారంతా వ్యవసాయదారులు. స్వయం సహాయక సంఘా(ఎస్‌హెచ్‌జీ)ల్లో సభ్యులుగా చేరారు. వ్యాపారంపై దృష్టి పెట్టారు. గ్రామైక్య సంఘం(వీవో) నుంచి రూ.లక్ష రుణం పొంది, అల్లం పేస్ట్ తయారీ వ్యాపారం ప్రారంభించారు. మొదట్లో తమ వాడలోని ఇండ్లకు, ఆ తర్వాత ఊర్లోనే తమ అల్లం పేస్ట్‌ను అందుబాటులోకి తెచ్చారు. క్రమంగా మండలం, జిల్లా దాటి.. రాష్ట్రవ్యాప్తంగా తమ వ్యాపారాన్ని విస్తరించారు. దుకాణాలు, హోటళ్లు, ఫంక్షన్లకూ హోల్‌సేల్‌గా అల్లం పేస్ట్‌ను సరఫరా చేస్తూ, మంచి లాభాలను పొందుతున్నారు. స్వశక్తితో ఇతర మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.. వరంగల్ జిల్లా నల్లబెల్లి కుటీర పరిశ్రమ నిర్వాహకులు.

నల్లబెల్లి మండలం గుండ్లపహాడ్ గ్రామానికి చెందిన కొందరు స్వయం సహాయక సంఘాల సభ్యులకు అల్లం వ్యాపారం చేయాలనే ఆలోచన వచ్చింది. ఈ నేపథ్యంలో ఐదు సంఘాల నుంచి 11 మంది సభ్యులు కలిసి, కొంత పెట్టుబడి సమకూర్చుకున్నారు. 'నల్లబెల్లి కుటీర పరిశ్రమ' పేరుతో ప్రత్యేకంగా ఒక సంఘాన్ని స్థాపించారు. గుండ్లపహాడ్ గ్రామంలో ఒక గదిని అద్దెకు తీసుకుని అల్లం వ్యాపారం ప్రారంభించారు. మొదట వరంగల్ నగరంలోని హోల్‌సేల్ దుకాణాల నుంచి అల్లం కొనుగోలు చేసి అమ్మారు. ఆ తర్వాత అల్లం పేస్ట్ తయారుచేస్తే మంచి లాభాలు వస్తాయని గుర్తించారు. అనుకున్నదే తడవుగా ఏడాది క్రితం గ్రామంలోని వీవో నుంచి రూ.లక్ష రుణం తీసుకున్నారు. అల్లం పేస్ట్ తయారీ కోసం యంత్రాన్ని కొనుగోలు చేశారు. దానిని గ్రామంలోని తమ అద్దె గదిలో ఏర్పాటు చేసి అల్లం పేస్ట్ తయారీ ప్రారంభించారు. మొదట్లో అల్లం పేస్ట్‌ను పావుకిలో, అరకిలో, కిలో చొప్పున డబ్బాల్లో ప్యాక్ చేసి తమ వాడలోని ఇండ్లకు సరఫరా చేసేవారు. ఆ తర్వాత గ్రామంలోని ఇతర ఇండ్లకూ చేరవేశారు. నాణ్యత బాగుండటంతో వీరి అల్లం పేస్ట్‌కు చుట్టు పక్కల గ్రామాల నుంచీ ఆర్డర్లు రావడం మొదలైంది.

### విస్తరిస్తున్న వ్యాపారం

అల్లం పేస్ట్ తయారు, అమ్మకం ద్వారా ఆశించిన ఫలితాలు రావడంతో 'నల్లబెల్లి కుటీర పరిశ్రమ' రోజురోజుకూ విస్తరిస్తున్నది. క్రమంగా నర్సంపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని



మండలాలు, ఆ తర్వాత వరంగల్ జిల్లాలోని ఇతర మండలాలకూ అల్లం పేస్ట్ సరఫరా కావడం మొదలైంది. ఇప్పుడు ములుగు, మహబూబాబాద్, హనుమకొండ జిల్లాలకూ 'నల్లబెల్లి' అల్లం పేస్ట్ చేరుతున్నది. చిన్న చిన్న దుకాణాలు మొదలుకుని హోల్‌సేల్ షాపుల వరకూ ఆర్డర్‌పై తయారు చేసి పంపిస్తున్నారు నల్లబెల్లి మహిళలు. పావు కిలో, అర కిలో నుంచి కిలో, రెండు కిలోలు, ఐదు కిలోల లెక్కన డబ్బాల్లో ప్యాక్ చేసి విక్రయిస్తున్నారు. ఆర్డర్లు పెరుగుతుండటంతో ఇప్పుడు ఎక్కువగా హోల్‌సేల్‌గానే అమ్మకాలు చేపడుతున్నారు.

### వ్యవసాయం చేస్తూనే..

ఈ పరిశ్రమలోని 11 మంది మహిళలు ఓవైపు వ్యవసాయం చేస్తూనే, మరో వైపు వ్యాపారాన్నీ నిర్వహిస్తున్నారు. ఉదయం, సాయంత్రం అల్లం పేస్ట్ తయారీకి, మధ్యాహ్నమంతా వ్యవసాయ పనుల కోసం సమయం కేటాయిస్తున్నారు. ప్రస్తుతం నల్లబెల్లి కుటీర పరిశ్రమకు అధ్యక్షురాలిగా దురిశెట్టి లక్ష్మి, కార్యదర్శిగా కొండోజు కళమ్మ, కోశాధికారిగా బొంత సంధ్య వ్యవహరిస్తున్నారు. వీరిలో సంధ్య పరిశ్రమ ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్నారు.

## 'దానిమ్మ'పై దాడి!



ప్రస్తుతం పండ్లతోటల్లో ఎక్కువ లాభాలను అందిస్తున్నది దానిమ్మ పంట. అయితే, ఎండు తెగులుతో ఈ పంటకు తీవ్రమైన నష్టం వాటిల్లుతున్నది. మొక్కలను పూర్తిగా నిర్వీర్యం చేసే ఈ తెగులు.. పండ్లతోటల రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నది. భూమిలో ఉండే శిలీంధ్రాల ద్వారా దానిమ్మ తోటల్లో 'ఎండు తెగులు' వ్యాపిస్తుంది. మొక్కల వేర్లను ఆశించే నులిపురుగులు, వేర్లు, కొమ్మలపై రంధ్రాలు చేసే రంపపుపొట్టు పురుగులు చేసే రంధ్రాల ద్వారా.. శిలీంధ్రాలు మొక్కలోకి ప్రవేశిస్తాయి. ఫలితంగా మొక్కల ఆకులు పసుపురంగులోకి మారి, వాడినట్లుగా కనిపిస్తాయి. క్రమంగా గోధుమ రంగులోకి మారి.. ఎండి రాలిపోతాయి. తెగులు వ్యాపించిన మొదట్లో మొక్కలు బలహీనంగా మారి, క్రమేపి ఆకులు రాలిపోతూ ఉంటాయి. కొన్ని వారాల్లోనే మొక్క పూర్తిగా ఎండిపోయి, చనిపోతుంది.

నివారణ చర్యలు : దానిమ్మ తోట వేయాలనుకునే రైతులు.. నాణ్యమైన, ఆరోగ్యమైన మొక్కలనే నాటుకోవాలి. ఇందుకోసం పేరొందిన నర్సరీల నుంచి మాత్రమే మొక్కలను కొనుగోలు చేయాలి. నాణ్యత కోసం ధరలో రాజీ పడొద్దు. మొక్కలు నాటే ముందు చేనులో పశువుల ఎరువుతోపాటు ఎకరానికి ఒక కిలో ట్రైకోడెర్మా విరిడి లేదా సూడోమోనాస్ ఫ్లోరెసెన్స్ జీవ శిలీంధ్రనాశనిని కలిపి, పొలమంతా చల్లి కలియదున్నాలి. దీనివల్ల ఎండుతెగులును కలిగించే శిలీంధ్రాన్ని నాశనం చేయవచ్చు. మొక్కలు మరీ దగ్గర దగ్గర కాకుండా.. మొక్క మొక్కకూ కనీసం 10 నుంచి 12 అడుగుల దూరం ఉండేలా నాటుకోవాలి. గుంతలు నింపేటప్పుడు ప్రతి గుంతకూ 500 గ్రా. వేపపిండి కలిపి వేయడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయి. మొక్కలు నాటేముందు ప్రతి గుంతలో 100 గ్రా. బ్లీచింగ్ పొడి చల్లుకోవాలి. మొక్కలు నాటిన తర్వాత.. లీటర్ నీటిలో 25 గ్రా. బ్లీచింగ్ పౌడర్ లేదా 2 గ్రా. బావిస్టిన్‌తోపాటు 2.5 మి.లీ. క్లోరిపైరిఫాస్ కలిపిన ద్రావణాన్ని మొక్కల పాదుల్లోని మట్టి తడిసేలా పోయాలి. అంతరపంటగా బంతిపూలను సాగుచేస్తే.. దానిమ్మ చెట్లకు నులిపురుగుల బెడద తగ్గుతుంది.



## చలికాలంలో ఉల్లి సాగు!

**ఉల్లిగడ్డలు చల్లని వాతావరణంలో పండే పంట అయినప్పటికీ, ఇవి ఎక్కువ మంచును తట్టుకోలేవు. మొక్కల పెరుగుదలకు 15 నుంచి 21 డిగ్రీల సెంటిగ్రేడ్, ఉల్లిగడ్డలు పెరగడానికి 20 నుంచి 25 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతలు అనుకూలంగా ఉంటాయి. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటే.. ఉల్లిగడ్డల పెరుగుదల లోపిస్తుంది. నీరు నిలువని సారవంతమైన నేలల్లో దిగుబడి ఎక్కువగా ఉంటుంది. ఉదజని సూచిక 6 – 7.5 మధ్య ఉండే నేలలు అనుకూలం. ఇక రకాల విషయానికి వస్తే.. బళ్లారి రెడ్, రాంపూర్ రెడ్, నాసిక్ రెడ్, పూసారెడ్, అర్క నికేతన్, అర్క కల్యాణ్, అర్క ప్రగతి, అర్క ఫౌండ్ లైట్ రెడ్, అగ్రి ఫౌండ్ డార్క్ రెడ్ రకాలను సాగుచేసుకోవచ్చు.**

**బళ్లారి రెడ్ :** ఈ రకంలో పాయలు పెద్దగా.. ఒకటిగా కానీ, రెండుగా కానీ కలిసి ఉంటాయి. అన్ని ప్రాంతాల్లోనూ సాగు చేయడానికి అనుకూలం.

**రాంపూర్ రెడ్ :** ఇది కూడా బళ్లారి రెడ్ రకాన్నే పోలి ఉంటుంది. పెద్ద పాయలు, ఎక్కువ ఘాటు ఉంటుంది. అయితే, ఇవి సాగు చేస్తే దిగుబడి తక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది.

**నాసిక్ రెడ్ :** పాయలు మధ్యస్థంగా ఉంటాయి. ఎరుపు రంగులో, ఎక్కువ ఘాటుగా ఉంటాయి.

**అర్క నికేతన్ :** ఈ రకంలో పాయలు ఎరుపు రంగులో ఉంటాయి. ఒక్కో కాయ 100 గ్రా. నుంచి 180 గ్రా. వరకూ బరువు తూగుతాయి. ఘాటు ఎక్కువగా ఉండే ఈ ఉల్లిగడ్డలను ఎక్కువ రోజులు నిల్వ ఉంచుకోవచ్చు.

**అర్క కల్యాణ్ :** ఎక్కువ దిగుబడి కావాలంటే.. అర్క కల్యాణ్ రకాన్ని సాగు చేసుకోవచ్చు. ఎకరానికి 13 నుంచి 14 టన్నులు వస్తాయి.

**అర్క ప్రగతి :** 120 రోజుల్లోనే పంట చేతికి వస్తుంది. పాయలు గుండ్రంగా, ఎరుపుగా ఉంటాయి. ఎకరానికి 13 టన్నులు దిగుబడి సాధించవచ్చు.

అర్క ఫౌండ్ లైట్‌రెడ్ : పాయలు చిన్నగా, గులాబీ రంగులో ఉంటాయి.

అగ్రి ఫౌండ్ డార్క్ రెడ్ : ఈ రకంలో పాయలు ముదురు ఎరుపు రంగులో.. గుండ్రంగా, ఘాటుగా ఉంటాయి. ఇవి ఎక్కువ కాలం నిల్వ ఉంటాయి.

# నిరుద్యోగులకు గుడ్ న్యూస్.. సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం!



వనపర్తి జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రెండవ దశ సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీ ఆదర్శ సురభి గారు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సిరాజుద్దీన్ అహ్మద్ గారు ప్రకటనలో తెలియజేయడం జరిగింది. వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో మార్చి 26 నుంచి ఏప్రిల్ 2 తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యచరణ ప్రణాళిక ద్వారా మన జిల్లాకు బ్యాంకులతో కూడిన యూనిట్స్ ఇవి. టూ వీలర్ కు 25 యూనిట్లు, జుఎ త్రి వీలర్ కు 11 యూనిట్లు, అగ్రిగోన్ సర్వీస్ 5 యూనిట్లు, అగ్రి మిషనరీ కామన్ హైరింగ్ సెంటర్ వన్ యూనిట్, సోలార్ యూనివర్సల్ పంపు కంట్రోల్ 9 యూనిట్లు, డైరీ 45 యూనిట్లు, సెరికల్చర్ లో మల్బరీ సాగుకు 4 యూనిట్లు, చౌకీ సెంటర్కు ఒక యూనిట్ కిసాన్ నర్సరీ రెండు యూనిట్లు హార్టికల్చర్ లో వెజ్ పెండాల్ లేదా ఆయిల్ ఫామ్ కు 7 యూనిట్లు మంజూరు కావడం జరిగింది. బ్యాంకు లోన్ లేకుండా 100% సబ్సిడీతో కూడిన యూనిట్స్ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలకు 100% సబ్సిడీ వర్తిస్తుందని వివరించారు. ఆధార్ కార్డ్ రేషన్ కార్డ్ ఫుడ్ సెక్యూరిటీ కార్డు కుల ధ్రువపత్రం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జారీ చేయబడినది అయి ఉండవలెను. ఆదాయం ధ్రువపత్రం మీసేవ ద్వారా జారీ చేసి ఉండవలెను. రవాణా రంగ పథకాల కోసం శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ టూవీలర్ టూ వీలర్ లైసెన్స్ కలిగిన వారు మాత్రమే అర్హులు. వ్యవసాయ పథకాల కొరకు పట్టాదారు పాస్ పుస్తకం రెండు ఎకరాల భూమి బోరు కలిగి ఉండాలి అలాగే వికలాంగులు అయితే సదరం సర్టిఫికెట్ తప్పనిసరిగా కలిగి ఉండాలి.ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకున్న పత్రాలను జత చేసి సంబంధిత మండల కార్యాలయంలో సమర్పించగలరు. వ్యవసాయ పథకాల కొరకు 21 నుండి 60 ఏళ్లు వ్యవసాయతర పథకాలకు 21 50 ఏళ్ళు ఉండవలెను. శిక్షణ కొరకు 18 నుండి 45 ఏళ్ల వయసు కలిగి ఉండాలి. అలాగే గ్రామీణ ప్రాంతాల వారి ఆదాయం 1.5 లక్షలు పట్టణ ప్రాంతం వారికి 2.0 లక్షల ఆదాయం కలిగి ఉండాలి. రాజీవ్ యువ వికాసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి గారు తెలియజేయడం జరిగింది.

# ఆన్‌లైన్‌లో డబ్బు ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారా? ఏ సర్వీస్ ఎప్పుడు ఉపయోగించాలో తెలుసా?



డిజిటల్ విప్లవం పుణ్యమా అని ప్రస్తుతం బ్యాంకింగ్ సేవలు మన అరచేతిలోకి వచ్చేశాయి. గతంలో డబ్బు పంపాలంటే బ్యాంకుకు వెళ్లి గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వచ్చేది, కానీ ఇప్పుడు క్షణాల్లో పని పూర్తవుతోంది. మరి ఏ సమయంలో ఏ సర్వీస్ యూజ్ చేయాలో తెలుసా? డిజిటల్ విప్లవం పుణ్యమా అని ప్రస్తుతం బ్యాంకింగ్ సేవలు మన అరచేతిలోకి వచ్చేశాయి. గతంలో డబ్బు పంపాలంటే బ్యాంకుకు వెళ్లి గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వచ్చేది, కానీ ఇప్పుడు క్షణాల్లో పని పూర్తవుతోంది. అయితే, ఈ సౌకర్యంతో పాటు వినియోగదారులకు ఒక కొత్త చిక్కు వచ్చి పడింది. వంటి రకరకాల పద్ధతులు అందుబాటులో ఉండటంతో, ఏ సందర్భంలో ఏది వాడాలో తెలియక చాలామంది గందరగోళానికి గురవుతున్నారు. సరైన అవగాహన లేకుండా ఏదో ఒక పద్ధతిని ఎంచుకోవడం వల్ల లావాదేవీలు ఆలస్యం కావడం లేదా అనవసరమైన అదనపు ఛార్జీలు చెల్లించాల్సి రావడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. అందుకే ప్రతి సిస్టమ్ యొక్క ప్రత్యేకతలు, పరిమితులు, అవి ఏయే పరిస్థితులకు సరిపోతాయో తెలుసుకోవడం ఇప్పుడు తప్పనిసరి. ఇది ప్రధానంగా 'బ్యాచ్-ఆధారిత' లావాదేవీ విధానం. అంటే మీరు డబ్బు పంపిన వెంటనే అది అవతలి వ్యక్తి ఖాతాలోకి చేరదు. బ్యాంకులు ఈ లావాదేవీలను ఒక సమూహం రూపంలో నిర్ణీత సమయాల్లో ప్రాసెస్ చేస్తాయి. సాధారణంగా ఒక లావాదేవీ పూర్తి కావడానికి 30 నిమిషాల నుండి 2 గంటల వరకు సమయం పట్టవచ్చు. మీ ఆర్థిక లావాదేవీ అంత అత్యవసరం కానప్పుడు, అదనపు ఖర్చు లేకుండా సురక్షితంగా డబ్బు పంపాలనుకున్నప్పుడు చీజుఖీ ఒక అద్భుతమైన ఎంపిక. ముఖ్యంగా జీతాల చెల్లింపులు లేదా నెలవారీ బిల్లుల వంటి వాటికి ఇది చాలా అనుకూలంగా ఉంటుంది. ఇక పెద్ద మొత్తంలో డబ్బును పంపాలనుకునే వారికి అత్యంత నమ్మదగిన మార్గం. ఇది ప్రత్యేకంగా భారీ విలువ కలిగిన లావాదేవీల కోసం రూపొందించబడింది. ఇందులో 'రియల్ టైమ్' అంటే మీరు ఇక్కడ బటన్ నొక్కగానే అక్కడ అవతలి వ్యక్తి ఖాతాలో డబ్బు జమవుతుంది. దీనికి కనీస పరిమితి రూ.2 లక్షలుగా నిర్ణయించారు. అంటే రూ.2 లక్షల కంటే ఎక్కువ మొత్తాన్ని వేగంగా, అత్యంత భద్రంగా పంపాలనుకున్నప్పుడు కంటే మెరుగైన ఆప్షన్ మరొకటి లేదు. వ్యాపార లావాదేవీలకు మరియు ఆస్తి కొనుగోలు వంటి పెద్ద ఖర్చులకు ఇది సరిగ్గా సరిపోతుంది. మరోవైపు, సర్వకాలాల్లో అంటే 24/7 అందుబాటులో ఉండే సేవ కావాలంటే ఎంచుకోవాలి. బ్యాంకు సెలవు దినాల్లో లేదా అర్ధరాత్రి పూట కూడా దీని ద్వారా క్షణాల్లో డబ్బు పంపవచ్చు. సాధారణంగా దీని పరిమితి రూ.5 లక్షల వరకు ఉంటుంది. అయితే, ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, చాలా బ్యాంకులు లావాదేవీలపై కొంత రుసుము వసూలు చేస్తాయి. అందుకే చిన్న చిన్న మొత్తాలకు కాకుండా, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే దీనిని వాడటం ఆర్థికంగా లాభదాయకం.

# ప్లాట్ కొంటే బెటరా? షేర్లు కొంటే బెటరా?





భారతీయులకి పెట్టుబడి అంటే ఇప్పటికీ భూమే మొదటి ఎంపిక.. కానీ 2026లో ఈ ఆలోచన ప్రమాదకరమైందిగా మారుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రియల్ ఎస్టేట్‌పై మమకారం వల్ల చాలా మంది పెట్టుబడిదారులు పెద్ద తప్పులు చేస్తున్నారని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. భారతదేశంలో పెట్టుబడి అనగానే సగటు మధ్యతరగతి కుటుంబానికి మొదట గుర్తొచ్చేది 'భూమి'. దశాబ్దాలుగా మన సమాజంలో ఆస్తి అంటే కేవలం ఒక ప్లాటో లేదా పొలమో మాత్రమే అనే భావన బలంగా నాటుకుపోయింది. భూమి అనేది కేవలం ఒక ఆర్థిక వనరు మాత్రమే కాదు అది భద్రతకు, సామాజిక హోదాకు చిహ్నంగా నిలుస్తుంది. అయితే, 2026 నాటి వేగవంతమైన ఆర్థిక మార్పుల నేపథ్యంలో, మన ఆలోచనా ధోరణి మారాల్సిన అవసరం ఉందని సెబీ (రాజుదీ×) రిజిస్టర్డ్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ అక్షయ్ బొమ్మెన అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులపై అక్షయ్ బొమ్మెన న్యూస్18 తెలుగుతో మాట్లాడుతూ.. "చాలామంది పెట్టుబడిదారులు భూమిపై ఉండే మమకారంతో నిర్ణయాలు తీసుకుంటారు. కానీ, ఇప్పుడు ప్రశ్న 'సౌకర్యం' గురించి కాదు, మీ పెట్టుబడి ఎంత వేగంగా పెరుగుతోంది (=వ్బతీఅం), అవసరమైనప్పుడు దాన్ని ఎంత త్వరగా నగదుగా మార్చుకోగలం (ాఱనబఱఅత్‌ఎ), అది దీర్ఘకాలంలో సంపదను ఎలా సృష్టిస్తుంది అనే దానిపైనే ఉండాలి" అని సూచించారు. ఈ చర్చకు మూలంలో ఒక ప్రధాన వ్యత్యాసం ఉంది, అదే 'భావోద్వేగం వర్సెస్ ఆర్థిక సామర్థ్యం'. ఈక్విటీ లేదా స్టాక్ మార్కెట్ పెట్టుబడుల గురించి సామాన్యుల్లో ఉన్న అపోహలపై అక్షయ్ క్లారిటీ ఇచ్చారు. ఈక్విటీ పెట్టుబడిని సరైన పద్ధతిలో చేస్తే, అది అదృష్టంతో ఆడే జూదం కాదని ఆయన స్పష్టం చేస్తున్నారు. ఇది పక్కా ప్రణాళిక, క్రమశిక్షణ, మార్కెట్ సమాచారం ఆధారంగా తీసుకునే నిర్ణయం. తమ పోర్ట్‌ఫోలియోలను తామే నిర్వహించుకోవాలనుకునే వారు, తమకు తగినంత ఆర్థిక జ్ఞానం, మార్కెట్ ఒడిదుడుకులను తట్టుకునే స్వభావం ఉన్నాయని నిర్ధారించుకోవాలి. "మార్కెట్ గందరగోళాన్ని చూసి భయపడి లేదా అనవసరమైన ట్రెండ్‌లను అనుసరించే బదులు, నిరూపితమైన అనుభవం ఉన్న సలహాదారులపై ఆధారపడటం మంచిది" అని ఆయన సూచిస్తున్నారు.

# ఈ నెలలో అత్యంత భారీగా పడిపోయిన బంగారం ధర..



ఈ నెలలో బంగారం ధరలు దాదాపు 14 శాతం పడిపోవడం మార్కెట్‌ను ఆశ్చర్యానికి గురి చేసింది. ద్రవ్యోల్బణం పెరుగుతుందనే సంకేతాలు ఉన్నప్పటికీ, ఇన్వెస్టర్లు ముందు జాగ్రత్తగా తమ వద్ద ఉన్న బంగారాన్ని విక్రయించడం కూడా ఈ పతనానికి కారణమైంది. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతలు, ప్రపంచ దేశాల సెంట్రల్ బ్యాంకుల విధానాలు కలిసి బంగారం ధరల్లో భారీ హెచ్చుతగ్గులకు దారి తీస్తున్నాయి. ముఖ్యంగా ఈ నెలలో బంగారం ధరలు దాదాపు 14 శాతం పడిపోవడం మార్కెట్‌ను ఆశ్చర్యానికి గురి చేసింది. ఎకనామిక్ టైమ్స్ వెల్లడించిన కథనం ప్రకారం.. ద్రవ్యోల్బణం పెరుగుతుందనే సంకేతాలు ఉన్నప్పటికీ, ఇన్వెస్టర్లు ముందు జాగ్రత్తగా తమ వద్ద ఉన్న బంగారాన్ని విక్రయించడం కూడా ఈ పతనానికి కారణమైంది. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతలు, ప్రపంచ దేశాల సెంట్రల్ బ్యాంకుల విధానాలు కలిసి బంగారం ధరల్లో భారీ హెచ్చుతగ్గులకు దారి తీస్తున్నాయి. ముఖ్యంగా ఈ నెలలో బంగారం ధరలు దాదాపు 14 శాతం పడిపోవడం మార్కెట్‌ను ఆశ్చర్యానికి గురి చేసింది. ఎకనామిక్ టైమ్స్ వెల్లడించిన కథనం ప్రకారం.. ద్రవ్యోల్బణం పెరుగుతుందనే సంకేతాలు ఉన్నప్పటికీ, ఇన్వెస్టర్లు ముందు జాగ్రత్తగా తమ వద్ద ఉన్న బంగారాన్ని విక్రయించడం కూడా ఈ పతనానికి కారణమైంది. బంగారం ధర పడిపోవడానికి ప్రధాన కారణాలు భారీ పతనానికి పలు అంతర్జాతీయ అంశాలు కారణమయ్యాయి. ముఖ్యంగా అమెరికా డాలర్ బలపడటం బంగారం ధరలపై నేరుగా ప్రభావం చూపింది. అలాగే, వడ్డీ రేట్ల తగ్గింపుపై ఉన్న అనిశ్చితి మార్కెట్‌ను మరింత ఒత్తిడికి గురి చేసింది. మరోవైపు, ముడి చమురు ధరలు పెరగడం వల్ల ద్రవ్యోల్బణం పెరుగుతుందనే భయం పెరిగింది. అయినప్పటికీ, సెంట్రల్ బ్యాంకులు వడ్డీ రేట్లను తక్షణమే తగ్గించే పరిస్థితి కనిపించకపోవడం వల్ల బంగారం డిమాండ్ తగ్గింది. దీంతో 2008 తర్వాత ఒకే నెలలో ఇంత పెద్ద పతనం నమోదు అయింది. బంగారం ధర పడిపోవడానికి ప్రధాన కారణాలుఈ భారీ పతనానికి పలు అంతర్జాతీయ అంశాలు కారణమయ్యాయి. ముఖ్యంగా అమెరికా డాలర్ బలపడటం బంగారం ధరలపై నేరుగా ప్రభావం చూపింది. అలాగే, వడ్డీ రేట్ల తగ్గింపుపై ఉన్న అనిశ్చితి మార్కెట్‌ను మరింత ఒత్తిడికి గురి చేసింది. మరోవైపు, ముడి చమురు ధరలు పెరగడం వల్ల ద్రవ్యోల్బణం పెరుగుతుందనే భయం పెరిగింది.

# డీజిల్ ఆటోమేటిక్ ఎస్‌యూవీలు 24 కి.మీ మైలేజ్. రూ.9.78 లక్షలకే లభ్యం

మీ బడ్జెట్ రూ.15 లక్షలు మాత్రమేనా? కానీ డీజల్ ఇంజిన్ టార్క్, ఆటోమేటిక్ సౌకర్యం, 24 కిలోమీటర్ల మైలేజ్ కావాలా? 2026లో హైదరాబాద్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రోడ్లపై ట్రాఫిక్, హైవేలు, కుటుంబ ప్రయాణాలకు ఇవి సూపర్ ఆప్షన్! దేశంలోనే అదిరిపోయే డీజల్ ఆటోమేటిక్ ాఖఎలు రూ.9.78 లక్షల నుంచి మార్కెట్‌లోకి వచ్చాయి. ఇవి సాధారణ మధ్యతరగతి కుటుంబాలకు ఇంధన ఖర్చులను తగ్గించి, డ్రైవింగ్ ఆనందం పెంచుతాయి. కార్‌దేఖో మార్చి 2026 రిపోర్టు ప్రకారం ఇప్పుడు డీజల్ ఆటో ాఖఎలు ఇప్పుడు మరింత చవక అయ్యాయి. ఎందుకు ఇప్పటికీ డీజల్ ఆటో ాఖఎలు బెస్ట్? తెలంగాణలో డీజల్ ధర ?88-92 రూపాయలు ఉంటే, 24 కిలోమీటర్ల మైలేజ్‌తో నెలకు 1500 కిలోమీటర్లు ప్రయాణం చేసేవారికి పెట్రోల్ కంటే డీజిల్ ఆటోమేటిక్ ద్వారా నెలకు రూ.4000 నుంచి రూ.5000 ఆదా అవుతుంది. ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ హైదరాబాద్ ట్రాఫిక్‌లో క్లచ్ బాధ లేకుండా సుఖంగా డ్రైవ్ చేయిస్తుంది. ఇది సురక్షితమైనది. ఫీచర్లు, స్పేస్ అన్నీ ఒకేసారి ఇచ్చే మోడల్స్ ఇవి. ఆధికారిక డేటా ప్రకారం ఇవి 5-స్టార్ సేఫ్టీ రేటింగ్‌లతో వస్తున్నాయని ఆటోకార్ ఇండియా, మార్చి 2026 రిపోర్టులో చెప్పింది.బంగారం ధరలు ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. డాలర్‌తో బంగారానికి ఉన్న సంబంధంబంగారం ధరల, అమెరికా డాలర్ మధ్య ప్రత్యక్ష సంబంధం ఉంటుంది. డాలర్ బలహీనపడితే బంగారం ధరలు పెరగడానికి అవకాశం ఉంటుంది. ఎందుకంటే డాలర్ విలువ తగ్గినప్పుడు, అంతర్జాతీయ మార్కెట్లో బంగారం తక్కువ ధరకే లభిస్తుంది. దీంతో డిమాండ్ పెరిగి ధరలు పైకి వెళ్లే అవకాశం ఉంటుంది. కానీ ప్రస్తుతం పరిస్థితి విరుద్ధంగా ఉండటంతో, బంగారం ధరలు ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి.





# ముగ్గురు బ్యూటీస్ నాగ్ కోసం..

తెలుగు సీనియర్ హీరోల్లో నాగార్జున సరైన సక్సెస్ చూసి చాలాకాలమైంది. గతేడాది కుబేర్, కూలీ సినిమాల్లో కాస్త డిఫరెంట్ పాత్రలు చేసి ఆకట్టుకున్నాడు. ప్రస్తుతం హీరోగా 100వ మూవీ చేస్తూ బిజీగా ఉన్నాడు. ఈ మూవీ గురించి సోషల్ మీడియాలో తప్పితే అధికారికంగా ఎలాంటి అప్‌డేట్స్ రావడం లేదు. తాజాగా ఈ చిత్రంలో హీరోయిన్ల గురించి డిస్కషన్ నడుస్తోంది. ఏకంగా ముగ్గురు బ్యూటీస్ నాగ్ సరసన నటించబోతున్నారట.గతంలో నిన్నే పెళ్లాడతా లాంటి సినిమాలో కెమిస్ట్రీతో అదరగొట్టిన నాగ్-టబు.. ఈ సినిమా కోసం మళ్లీ కలుస్తున్నారట. చాన్నాళ్ల క్రితమే ఈ రూమర్ బయటకొచ్చింది. కానీ నిజమా కాదా అనేది మాత్రం క్లారిటీ రాలేదు. తాజాగా 'సంక్రాంతికి వస్తున్నాం' ఫేమ్ ఐశ్వర్య రాజేశ్ కూడా మరో కథానాయికగా ఎంపికైందని అంటున్నారు. వీళ్లిద్దరితో పాటు సుస్మితా భట్ అనే తమిళ బ్యూటీ కూడా ఇందులో ఉందని టాక్ వినిపిస్తోంది.తమిళ దర్శకుడు ఆర్.కార్తిక్ తీస్తున్న ఈ సినిమా లాటరీ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లా తీస్తున్నారని తెలుస్తోంది. వచ్చే ఏడాది సంక్రాంతి టార్గెట్‌గా థియేటర్లలోకి తీసుకురావాలని మేకర్స్ అనుకుంటున్నారట. ఈ ?స్టోరీని గట్టిగా నమ్మిన నాగ్.. తనే స్వయంగా నిర్మిస్తున్నారు కూడా. ఏదేమైనా నాగ్ సరసన ముగ్గురు హీరోయిన్లు అనే రూమర్ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో ఆసక్తికర టాపిక్ అయిపోయింది.ఖ

# సినీ ఇండస్ట్రీని షేక్ చేస్తున్న బెస్ట్ ఫ్రెండ్స్

ఇప్పటి హీరోలు క్యారెక్టర్ కోసం ఎంత కష్టపడ్డానికైనా సిద్ధంగా ఉంటారు. తమ మేకోవర్ కోసం ఎంత దూరమైనా వెళ్తారు. రీసెంట్‌గా వచ్చిన ఇద్దరు హీరోల లుక్స్ చూస్తే ఈ విషయాన్ని మరోసారి రుజువు చేస్తుంది. ఆ ఇద్దరు హీరోల్లో ఒకరు మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్, మరొకరు అతడి బెస్ట్ ఫ్రెండ్ శర్వానంద్.వీరిద్దరూ తమ మేకోవర్స్‌తో టోటల్ ఇండస్ట్రీని ఆకర్షిస్తున్నారు. ముందుగా రామ్ చరణ్ విషయానికొస్తే, తాజాగా తన పుట్టినరోజు నాడు రిలీజైన 'పెద్ది' సినిమా రెండో గ్లింప్స్ లో అందర్నీ ఆకట్టుకున్న అంశం చరణ్ బాడీ. ఆ పహిల్వాన్ లుక్ కోసం చరణ్ ఎంత కష్టపడ్డాడో ఆ లుక్ చూస్తుంటే ఇట్టే అర్థమైపోతుంది.చరణ్ ఈ లుక్ కోసం కొన్ని నెలల పాటు మాంసాహారం మానేశాడని సమాచారం. ఓవైపు అయ్యప్ప దీక్షలో ఉంటూనే, మరోవైపు పహిల్వాన్ లుక్ కోసం కసరత్తులు చేశాడు. పహిల్వాన్ లుక్ కోసం నిజమైన పహిల్వాన్‌లు చేసే కసరత్తులనే చరణ్ చేశాడు. అలా దాదాపు 8 నెలల పాటు ఎంతో కష్టపడి మరీ ఈ కండలు తిరిగే దేహాన్ని చరణ్ సొంతం చేసుకున్నాడు.అయితే శర్వానంద్ బైకర్ రోల్ కోసం మరింత స్ఫూర్తిదాయకమైన ప్రయాణం చేశాడు. ఆ రోల్ కోసం ఇతడు పడిన కష్టం అంతా ఇంతా కాదనే చెప్పాలి. బైకర్ చిత్ర దర్శకుడు శర్వాను 6-8 కిలోలు తగ్గితే చాలన్నాడట. కానీ శర్వానంద్ మాత్రం అంతకుమించి కష్టపడ్డాడు. అక్షరాలా రోజుకు 32 కిలోమీటర్లు పరుగెత్తేవాడని సమాచారం. 42 సంవత్సరాల శర్వానంద్ 18 ఏళ్ల బైక్ రేసర్‌గా కనిపించేందుకు తన శరీరంలోని ప్రతి అణువునూ కరిగించేలా కసరత్తు చేశాడట. ప్రస్తుతం తన ఒంట్లో ఏమాత్రం కొవ్వు లేనంత బక్కపల్చగా తయారయ్యాడు. ఇలా టీనేజర్ గా కనిపించడం కోసం శర్వానంద్ ఏకంగా రెండేళ్లు కష్టపడ్డాడు. ఇక బైకర్ ట్రయిలర్ ఎంత క్లిక్ అయిందో, అందులో శర్వా లుక్ అంతకంటే ఎక్కువగా అందరి ప్రశంసలు పొందింది.







# ఇప్పట్లో పెళ్లి ఆలోచన లేదు నిర్మొహమాటంగా చెప్పి సాయిపల్లవి

దక్షిణాది సినీ పరిశ్రమలో సహజ నటనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న స్టార్ హీరోయిన్ సాయి పల్లవి మరోసారి వార్తల్లో నిలిచారు. డ్యాన్స్ షోల నుంచి సినీ ప్రపంచంలోకి అడుగుపెట్టి, తన టాలెంట్‌తో టాప్ హీరోయిన్‌గా ఎదిగిన ఆమె ప్రయాణం నిజంగా స్ఫూర్తిదాయకం. చిన్నప్పటి నుంచే నాట్యం, నటనపై ఆసక్తి ఉన్నప్పటికీ చదువును ప్రాధాన్యంగా తీసుకుని మెడికల్ డిగ్రీ పూర్తి చేసిన సాయి పల్లవి, ప్రేమమ్ సినిమాలో 'మలర్ టీచర్' పాత్రతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ తర్వాత ఫిదా సినిమాతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరై, తన సహజ నటన, తెలంగాణ యాసతో కుర్రకారును మెస్మరైజ్ చేసింది. దీంతో ఆమెకు 'లేడీ పవర్ స్టార్' అనే ట్యాగ్ కూడా వచ్చింది. ప్రస్తుతం ఆమె కెరీర్ పీక్‌లో ఉంది. బాలీవుడ్‌లో జునైద్ ఖాన్ తో కలిసి ఓ సినిమాతో ఎంట్రీ ఇస్తుండగా, ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ రామాయణం లో సీత పాత్ర పోషించడం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. అలాగే తమిళంలో ధనుష్ సరసన కూడా ఓ భారీ చిత్రంలో నటిస్తూ బిజీగా ఉంది. ఇదిలా ఉంటే, ఇటీవల ఆమె పెళ్లిపై వస్తున్న రూమర్లకు తానే స్వయంగా ఫుల్‌స్టాప్ పెట్టింది. ఒక కార్యక్రమంలో మీడియా అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ సాయి పల్లవి స్పష్టంగా తన అభిప్రాయం వెల్లడించింది. 'ప్రస్తుతం నా పూర్తి దృష్టి కెరీర్‌పైనే ఉంది. పెళ్లి గురించి ఇప్పట్లో ఎలాంటి ఆలోచన లేదు. నేను ప్రస్తుతం సింగిల్‌గానే ఉన్నాను అని చెప్పి అందరికీ క్లారిటీ ఇచ్చింది. ఆమె పెళ్లి విషయంపై సోషల్ మీడియాలో విభిన్న స్పందనలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఫ్యాన్స్ ఆమె నిర్ణయాన్ని సమర్థిస్తుంటే, మరికొందరు మాత్రం ఆమె పెళ్లి వార్త కోసం ఎదురుచూస్తున్నారు.

# అసలే ఫ్లాపులు.. ఇప్పుడు వివాదంలో ఇరుక్కుని



ఒకప్పుడు స్టార్ డైరెక్టర్‌గా వెలుగువెలిగిన ఏఆర్ మురుగదాస్.. ఇప్పుడు కెరీర్ పరంగా పూర్తిగా డౌన్ అయిపోయాడు. చేసిన సినిమాలు చేసినట్లు అట్టర్ ఫ్లాప్ అయ్యేసరికి ఒక్కరూ కూడా ఇతడిని పట్టించుకోవట్లేదు. ఇప్పుడు ఇది చాలదన్నట్లు ఓ వివాదంలో ఇరుక్కున్నాడు. టాలీవుడ్ నిర్మాత.. తాజాగా ఫిర్యాదు చేయడంతో ఇది కాస్త వెలుగులోకి వచ్చింది. ఇంతకీ అసలు ఏమైంది?గతేడాది మురుగదాస్ నుంచి రెండు మూవీస్ వచ్చాయి. వాటిలో సల్మాన్ ఖాన్‌తో చేసిన 'సికందర్' ఒకటి కాగా శివకార్తికేయన్‌తో చేసిన 'మదరాశి' ఒకటి. ఇవి రెండు దారుణంగా ఫ్లాప్ అయ్యాయి. 'మదరాశి' చిత్ర నిర్మాత ఎన్వీ ప్రసాద్ ఇప్పుడు తమిళ దర్శకులు, నిర్మాతల కౌన్సిల్‌లో ఏఆర్ మురుగదాస్‌పై ఫిర్యాదు చేశారు. తొలుత రూ.115 కోట్ల బడ్జెట్ అని చెప్పి షూటింగ్ పూర్తయ్యేసరికి రూ.170 కోట్ల మేర ఖర్చు చేశాడని తన కంప్లైంట్‌లో పేర్కొన్నారు.అయితే బడ్జెట్ పెరగడానికి మురుగదాస్‌కి సరైన ప్లానింగ్ లేకపోవడం, దీనితో పాటు 'సికందర్' సమాంతరంగా చేయడమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. తమకు జరిగిన నష్టానికిగానూ రూ.10 కోట్ల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. దీనిపై ఇరువర్గాల మధ్య చర్చ జరగ్గా.. అంతిమంగా కౌన్సిల్ ఓ నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం.. ఏఆర్ మురుగదాస్, తన రమణ 2(ఠాగూర్ సీక్వెల్) స్టోరీని సదరు నిర్మాణ సంస్థకు ఉచితంగా ఇచ్చేందుకు అంగీకారం తెలిపాడట. అలా ఈ వివాదానికి ఓ పరిష్కారం దొరికిందని కోలీవుడ్‌లో మాట్లాడుకుంటున్నారు. ప్రస్తుతానికైతే మురుగదాస్ చేతిలో కొత్త ప్రాజెక్ట్ ఏం లేదు. ఈ వివాదం జరిగిన తర్వాత వస్తుందా అనే నమ్మకం కూడా కలగట్లేదు!

# సింగర్ నుంచి ఐటమ్ డ్యాన్సర్‌గా..



పాటలు పాడే సింగర్స్ మహా అయితే మ్యూజిక్ డైరెక్టర్స్ అవుతారు. కొన్నిసార్లు మాత్రం ఊహించని సర్‌ప్రైజ్ ఇస్తుంటారు. లేటెస్ట్‌గా ఓ తెలుగు గాయని.. ఐటమ్ సాంగ్‌లో గ్లామరస్ డ్యాన్స్ చేసి అదరగొట్టింది. ఆమెనే జోనితా గాంధీ. తెలుగు ప్రేక్షకుల్లో కొందరికి ఈమె గురించి తెలుసు. అయితే ఈమె నుంచి అదిరిపోయే డ్యాన్స్ చూసి మాత్రం ఆశ్చర్యపోయారు. ఇంతకీ ఈమె ఎవరు? డీటైల్స్ ఏంటి?జోనితా గాంధీ ఢిల్లీలో పుట్టింది. ఈమెకు 9 నెలల వయసున్నప్పుడే కుటుంబమంతా కెనడా వెళ్లిపోయింది. తర్వాత అక్కడే సెటిలైపోయారు. దీంతో చదువంతా అక్కడే పూర్తి చేసింది. ఏడేళ్లు ఉన్నప్పుడే పాటలు పాడటం లాంటివి చేసింది. తర్వాత కొన్నేళ్లకు తన పాడిన పాటల్ని యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసేది. వాటికి మంచి రెస్పాన్స్ వస్తుండేసరికి పాడటాన్ని కెరీర్‌గా ఎంచుకోవాలని నిర్ణయించుకుంది. కొన్నాళ్లకు భారత్‌కి తిరిగొచ్చింది.జోనితాలోని ప్రతిభని గుర్తించిన బాలీవుడ్ సంగీత ద్వయం విశాల్-శేఖర్.. షారూఖ్ ఖాన్ 'చెన్నై ఎక్స్‌ప్రెస్' టైటిల్ సాంగ్ పాడే అవకాశం కల్పించారు. తొలి పాటే ఎస్పీ బాలసుబ్రమణ్యం లాంటి ప్రసిద్ధ గాయకుడితో కలిసి పాడేసరికి జోనితాకు ఫేమ్ వచ్చింది. తర్వాత ఏఆర్ రెహమాన్, ప్రీతమ్, అమిత్ త్రివేది తదితర సంగీత దర్శకులు కంపోజ్ చేసిన సాంగ్స్ పాడింది.అనిరుధ్‌తో కలిసి ఈమె పాడిన కావాలయ్యా, అరబిక్ కుతు లాంటి పాటలు సెన్సేషన్ సృష్టించాయి. 'కిక్ 2' మూవీలోని నువ్వే నువ్వే ప్రాణం పాటతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చింది. లవ్ స్టోరి, సర్కారు వారి పాట తదితర చిత్రాల్లో సాంగ్స్ పాడింది. ఓవరాల్‌గా చూస్తే తెలుగు, తమిళ, కన్నడ, బెంగాలీ, గుజరాతీ, మరాఠీ, పంజాబీ, ఉర్దూ, ఇంగ్లీష్‌లో పాటలు పాడి మెప్పించింది. ఇన్ స్టాలో 28 లక్షల ఫాలోవర్స్ ఉన్న ఈమె.. లైవ్ కన్సర్ట్స్‌తోనూ సంగీత ప్రియుల్ని ఎంటర్‌టైన్ చేస్తూనే ఉంది.ఇన్నాళ్లు సింగర్‌గా అందరికీ తెలిసిన జోనితా గాంధీ.. అడివి శేష్ 'డకాయిట్' కోసం తొలిసారి ఐటమ్ సాంగ్‌లో డ్యాన్స్ చేసింది. అందచందాలతో ఆశ్చర్యపరిచింది. చూస్తుంటే సింగర్‌గా ఏమో గానీ డ్యాన్సర్‌గా మాత్రం మరింత బిజీ అవుతుందేమో అనిపిస్తుంది.

CORPORATE OFFICE:SNEHALA MEDIA PUBLICATIONS LLP, PLOT NO. 267,HUDA SAI NAGAR COLONY, BESIDE COMMUNITY HALL, VANASTHALIPURAM, RR DIST, HYDERABAD 500070.TG. CELL. 9348313999/8885727777.

Edited, Printed, Published & Owned By GURRAM PAPI REDDY,# H.No.4-57, Thorrur Village, Abdullapurmet Mandal, Turkayamal Municipality, Ranga reddy District.501511. Telangana. Printedat:GARUDA PRINT- ERS,# H.No.2-86/1, PlotNo.23-SP, SyNo.417, Sagar Highway, Ranganaguda Village, Abdullapurmet Mandal, Turkayamjal Municipality, Ranga reddy District.501510.Telangana.Published at: # H.No.4-57, Thorrur Village,Abdullapurmet Mandal, TurkayamalMunicipality, Ranga reddy District. 501511. Telangana...www.arunaprabha.com..email.arunaprabhadaily@gmail.com, RNI NO. TELTEL/2023/89778, Cell No. 9700127889